

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను


సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 429 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 21 ఏప్రిల్ 2026 | వెల : 4/-

## మే చివరి నాటికి బ్యారేజీల మరమ్మతులు పూర్తి కావాల్సిందే!



- బోర్ల తవ్వకంపైనే కీలక సమాచారం
- మే నెలాఖరుకు పూర్తి చేయాలని సర్కారు లక్ష్యం
- రోటర్ టైప్ డ్రిల్లింగ్ విధానంలో తవ్వకాలు చేపట్టిన ఇంజినీర్లు
- వానాకాలంలో పునరావాస డిజైన్లు
- వేగంగా పరీక్షలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం



### ఢిల్లీకి హరీశ్‌రావు బృందం.. కాళేశ్వరం కమిషన్‌పై న్యాయపరమైన చర్చలు

- కాళేశ్వరంపై ఎల్లుండి తెలంగాణ హైకోర్టులో తీర్పు రానుంది.
- పార్టీ ఫిరాయింపుల కేసు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై బీఆర్ఎస్ త్రిసభ్య బృందం చర్చించనుంది.

## సీబీఐ విచారణకు అప్పగించాం

- గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- ప్రొఫెసర్.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని కోరిన సీఎం
- ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా కొనసాగుతున్న అజారుద్దీన్
- ఆయన మంత్రి పదవి చేపట్టి ఈ నెలాఖరుకు ఆరు నెలలు పూర్తి కానుంది.



అక్షర మేధ న్యూస్ హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న ఇద్దరు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పేర్లు ఆమోదించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రొఫెసర్.కోదండరామ్, అజారుద్దీన్ పేర్లు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఏ సభలో సభ్యుడు కానప్పటికీ మంత్రిగా అజారుద్దీన్ కొనసాగుతున్నారు. ఆయన మంత్రి పదవి చేపట్టి ఈ నెలాఖరుకు ఆరు నెలలు పూర్తి కానుంది. 6 మాసాల్లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఉండాల్సిన అవసరం ఉంది. గవర్నర్ ఆమోదించకపోతే ఈ నెల 30 తర్వాత అజారుద్దీన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే గవర్నర్‌ను సీఎం కలిసినట్లుగా తెలిసింది. - మిగతా3లో

## బీజేపీకి లొంగిపోయిన అన్నాడీఎంకే

- తమిళనాడును పాలించాలనే ఉద్దేశంతో ఆర్ఎస్ఎస్
- అవినీతి కారణంగా ఏఐఏడీఎంకే బీజేపీకి లొంగిపోయింది
- తమిళ సంస్కృతి, భాషను కాపాడేందుకు డీఎంకే
- కాంగ్రెస్ కట్టుబడి ఉన్నాయని వ్యాఖ్య
- మణిపూర్ ఉద్రిక్తతలపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు



## 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు భారత్

- కొరియా మధ్య వాణిజ్యం : మోదీ
- భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాదని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- "భారత్-కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరుకుంది
- 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా ఈరోజు మేము పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం.





## వచ్చే 4,5 రోజులు నిప్పుల కొలిమే

- ఆ రాష్ట్రాల్లో తీవ్ర వడగాలులు: ఐఎండీ హెచ్చరిక
- ఏప్రిల్ 25 వరకు దేశంలో తీవ్ర వడగాల్పులు
- ఆ రాష్ట్రాల్లో మాత్రం వడగళ్ల వానలు!

## మళ్లీ వచ్చేది 100 శాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే



- రైతాంగం ఆగమాగమైపోయి చెట్టుకొకలు పుట్టుకొకరు అయిపోయారు
- కొన్ని పార్టీలు చేసే పని చూస్తే బాధ కలిగేది
- మహబూబ్‌నగర్ జిల్లాలో నూటికి 90 మంది యువకులు వలస
- బతుకాలంటే బతుకపోవాలే.
- తెలంగాణ రాకముందు ఎంత భయంకరమైన బాధలుండే.. ఎంత కష్టముండే.
- తెలంగాణ అగమ్యగోచరంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది
- చంద్రబాబు నాడు కరెంట్ ఛార్జీలు పెంచితే నేను ఉత్తరం రాశా
- తెలంగాణా ఉద్యమం చేస్తానని హెచ్చరించా.
- 40 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తనకు మంచి స్నేహం ఉంది

అక్షర మేధ న్యూస్ జగిత్యాల

మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గుండె ధైర్యమున్న నేత అని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. జగిత్యాల జిల్లాలో సోమవారం నిర్వహించిన 'బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకటించారు కేసీఆర్. అనంతరం కేసీఆర్ ప్రసంగిస్తూ.. 40 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తనకు మంచి స్నేహం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే జీవన్‌రెడ్డి పార్టీలోకి వచ్చారని తెలిపారు. భిన్న రాజకీయ సిద్ధాంతాలతో వేర్వేరు పార్టీల్లో పనిచేశామని చెప్పారు. జగిత్యాల ప్రాంతం కోసం జీవన్‌రెడ్డి ప్రాణం పెట్టి పనిచేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా మంత్రిగా చిత్తశద్ధితో పనిచేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు కోసం జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు కోసమే జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. తన ప్రాంత అభివృద్ధి కోసం జీవన్‌రెడ్డి ఏదైనా చేస్తారని తెలిపారు. 'ఇవాళ తెలంగాణ అగమ్యగోచరంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. వినయ్ భాస్కర్ - మిగతా3లో



## రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాల బీభత్సం

- చేతికొచ్చిన పంటలు నేలమట్టం
- నిజామాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
- వాన ధాటికి నేలవాలిన వరి, మొక్కజొన్న పంటలు
- పలు మార్కెట్లలో వరదకు కొట్టుకుపోయిన ధాన్యం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వేడుకుంటున్న రైతులు

అక్షర మేధ న్యూస్ హైదరాబాద్

రాష్ట్రంలో అకాల వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, వడగండ్ల వానతో కూడిన వర్షానికి పంట నేలవాలింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి - మిగతా3లో



## రాజస్థాన్‌లోని రిఫైనరీ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించాల్సిన రిఫైనరీ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారుల వెల్లడి



## లారక్ ద్వీపానికి దూరంగా ఉండండి

- ఇరాన్ దాడుల వేళ భారతీయ నౌకలకు ఇండియన్ నేవీ అడ్వైజరీ
- హర్మూజ్ జలసంధిలో రెండు భారతీయ నౌకలపై ఇరాన్ కాల్పులు
- ఈ నేపథ్యంలో ఇండియన్ ట్యాంకర్లకు రక్షణగా రంగంలోకి దిగిన నేవీ



## అమెరికాతో రెండో విడత చర్చలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

- దౌత్య మార్గాన్ని అనుసరిస్తున్నామని చెబుతూనే అమెరికా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోంది
- కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం నుంచే అమెరికా నుంచి తమకు వ్యతిరేకత ఫిర్యాదులు ఎదురయ్యాయి
- ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

వివరాలు 2లో..

# బీజేపీకి లొంగిపోయిన అన్నాడీఎంకే

తమిళనాడులోని అన్నాడీఎంకే అవినీతి కారణంగా బీజేపీకి లొంగిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రస్తుతం ఆ పార్టీ తమిళనాడులోకి బీజేపీ ప్రవేశానికి వాహనంలా మారిందని విమర్శించారు. మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలోని అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ కన్యాకుమారిలో జరిగిన సభలో పాల్గొన్న రాహుల్, బీజేపీ-అన్నాడీఎంకేపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర రాజకీయాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, ద్రవిడ సిద్ధాంతాన్ని ఆర్ఎస్ఎస్ ద్వేషిస్తోందని, అదే తమిళనాడుపై పాలన సాధించాలనే ప్రయత్నం చేస్తోందని అన్నారు. ప్రతి రాష్ట్రానికి సొంత స్వరూపం, సంస్కృతి, భాష ఉంటాయని గుర్తుచేసిన ఆయన, ఆ రాష్ట్ర ప్రజలే తమ రాష్ట్రాన్ని పాలించాలి అన్నది కాంగ్రెస్ సిద్ధాంతమని తెలిపారు. బీజేపీ మాత్రం ఒకే సంస్కృతి, ఒకే భాష, ఒకే చరిత్ర అనే విధానాన్ని ముందుకు తీసుకెళ్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు.

ఇది భారతదేశంలోని విభిన్నతను దెబ్బతీసే ప్రయత్నమని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు ప్రజలే తమ రాష్ట్రాన్ని పాలించాలని, దిల్లీ నుంచి నియంత్రణ ఉండకూడదని స్పష్టం చేశారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభావంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడుపై నియంత్రణ సాధించాలనుకున్నారని ఆరోపించారు. ఆ క్రమంలో ఏఐఏడీఎంకే నాయకుడు పళనిస్వామి ద్వారా రాష్ట్రాన్ని ప్రభావితం చేయాలని ప్రయత్నించారని పేర్కొన్నారు.

**అగ్నికి ఆహుతి చేశారంటూ ఆరోపణలు**

తమిళ భాష, సంస్కృతి, చరిత్రను కాపాడేందుకు డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు కట్టుబడి ఉన్నాయని రాహుల్ గాంధీ అన్నారు. ప్రజల స్వాభిమానాన్ని కాపాడే పోరాటంలో ఈ



కూటమి ముందుంటుందని చెప్పారు. అదే సమయంలో, మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మణిపుర్?లో శాంతియుత పరిస్థితులను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని అగ్నికి ఆహుతి చేశారని ఆరోపించారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ అక్కడ గృహయుద్ధ వాతావరణం కొనసాగుతోందని అ్నారు.

మణిపుర్‌లో ఇటీవల జరిగిన దాడిలో ఐదేళ్ల బాలుడు, ఐదు నెలల శిశువు మృతి చెందడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపిందని తెలిపారు. ఈ ఘటనల అనంతరం అక్కడి పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని, ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారని చెప్పారు. భద్రతా దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి టియర్ గ్యాస్, స్మోక్ బాంబులను ఉపయోగించాల్సి వచ్చిందని వివరించారు. మణిపూర్‌లో హింస 2023 మే 3న ప్రారంభమైందని గుర్తుచేసిన రాహుల్ గాంధీ, మెయితీ, కుకీ సముదాయాల మధ్య జరిగిన ఘర్షణలు భారీ నష్టం కలిగించాయని చెప్పారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, ప్రజల నిరాశ్రయత్వం వంటి సమస్యలు తీవ్రంగా పెరిగాయని అన్నారు. ఈ పరిణామాలను తమిళనాడుతో పోల్చుతూ, బీజేపీ దేశంలోని రాష్ట్రాలను దిల్లీ నుంచి నియంత్రించాలనే ఉద్దేశంతో పనిచేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. "ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ అధికారాన్ని కైవసం చేసుకుని, రాష్ట్రాలను కేంద్రం నుంచి నడపాలని బీజేపీ ప్రయత్నిస్తోంది" అని అన్నారు. ఏఐఏడీఎంకే గతంలో తమిళనాడులో కీలక పాత్ర పోషించిన పార్టీ అని, ప్రజల అభివృద్ధికి ఎంతో సేవ చేసిందని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ తన స్వరూపాన్ని కోల్పోయి, బీజేపీ చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని విమర్శించారు. అవినీతి కారణంగా ఆ పార్టీ నాయకత్వం పూర్తిగా లొంగిపోయిందని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రతి రాష్ట్రానికి సొంత గుర్తింపు ఉండాలని, ఆ గుర్తింపును కాపాడటం చాలా ముఖ్యమని రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ మాత్రం అన్ని సంస్కృతులను ఒకే రూపంలోకి తీసుకురావాలని చూస్తోందని విమర్శించారు. ఇది దేశ ఐక్యతకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇక తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఏప్రిల్ 23న ఒక్క దశలో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రధానంగా డీఎంకే ఆధ్వర్యంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ మధ్య పోటీ ఉండనుంది. ఈ కూటమిలో బీజేపీ, పీఎంకే వంటి పార్టీలు భాగస్వామ్యంగా ఉన్నాయి.

# 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు భారత్

భౌగోళిక రాజకీయ అస్థిరతల దృష్ట్యా, పెరుగుతున్న వాణిజ్య అంతరాయాల నేపథ్యంలో భారత్- దక్షిణ కొరియాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న జజ్బూూ (సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం) చర్చలు ప్రారంభించడానికి అంగీకరించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని ప్రకటించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం కలిసి పనిచేయాలని కూడా ఇరుపక్షాలు తీర్మానించాయి. మూడురోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ప్రధాని మోదీ దిల్లీలో సమావేశమయ్యారు. సెమీ కండక్టర్ల తయారీ, రక్షణ రంగం, హరిత ఇంధనం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం వంటి అంశాలపై ఇరు దేశాధినేతలు చర్చలు జరిపారు.

భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలకు ప్రజాస్వామ్య విలువలే పునాదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన అనేవి ఇరు దేశాల డీఎన్ఏలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల చర్చల అనంతరం మీడియా సమావేశంలో మట్లాడిన ప్రధాని, భారత్-దక్షిణ కొరియా మైత్రి ప్రపంచానికి శాంతి, స్థిరత్వ సందేశాన్ని ఇస్తుందని మోదీ అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సమగ్ర వృద్ధి కోసం ఇరు దేశాలు ఒకే విధమైన దృక్పథాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. గత దశాబ్ద కాలంలో ఇరు దేశాల బంధం మరింత క్రియాశీలకంగా మారిందని వివరించారు. ప్రతి రంగంలోనూ కొత్త అవకాశాలను అందిపుచ్చు కుంటూ రెండు దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని మోదీ స్పష్టం చేశారు.



"భారత్-కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచే దిశగా ఈరోజు మేము పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. రెండు దేశాల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలను సులభతరం చేసేందుకు భారత్-కొరియా ఫైనాన్షియల్ ఫోరమ్‌ను ప్రారంభించాం. వ్యాపార సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఒక పారిశ్రామిక సహకార కమిటీని ఏర్పాటు చేశాం. కీలకమైన సాంకేతికత, సరఫరా గొలుసుల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఆర్థిక భద్రతా చర్చలకు శ్రీకారం చుడుతున్నాం. కొరియన్ కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భారత్‌లో ప్రవేశించడాన్ని సులభతరం చేయడానికి కొరియన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తాం. వచ్చే ఏడాది కాలంలో భారత్-కొరియా వాణిజ్య ఒప్పందాన్ని అప్‌గ్రేడ్ చేస్తాం." ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రస్తుతం అమల్లో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పునరుద్ధరించే అంశంపై భారత్- కొరియా చర్చలు జరిపినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్? తెలిపారు. కొరియా వాణిజ్య మంత్రి యో హాన్-కూతో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందంపై చర్చించినట్లు వివరించారు. "భారత్-కొరియా జజ్బూూ (సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం) ఉన్నతీకరణ చర్చలను తిరిగి ప్రారంభం, పునరుద్ధరించే మార్గాలపై మాట్లాడం. అలాగే పారిశ్రామిక సహకారం, హరిత ఇంధనం, డిజిటల్ వాణిజ్య రంగాల్లో మరింత లోతైన సహకారానికి గల అవకాశాలపై చర్చించాం" అని గోయల్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. 2010 జనవరిలో అమల్లోకి వచ్చిన జజ్బూూ ఒప్పందంపై ఇరు దేశాలు దృష్టి సారించాయి. ఇప్పటివరకు దీనికి సంబంధించి 10కి పైగా సమీక్షా సమావేశాలు జరిగాయి. ఉక్కు, బియ్యం, రొయ్యల వంటి కొన్ని ఉత్పత్తుల ఎగుమతులను పెంచే ఉద్దేశంతో దక్షిణ కొరియా మార్కెట్‌లో ఈ ఉత్పత్తుల విస్తరణకు అవకాశం ఇవ్వాలని భారత్ గతంలో కోరింది. కొరియా సంస్థలు భారతీయ ఉక్కును కొనుగోలు చేయకపోవడం వంటి సమస్యలను కూడా భారత్ ప్రస్తావించింది.

**దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనస్వాగతం**

అంతకుముందు మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చిన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనస్వాగతం లభించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలు లీ జే మ్యుంగ్, ఆయన భార్య కిమ్ హీ క్యుంగ్‌లకు సాదర స్వాగతం పలికారు. అనంతరం లీ సైనిక గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత రాజ్‌ఘాట్‌కు వెళ్లిన జాతిపిత మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. గాంధీజీ విగ్రహానికి పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అక్కడ ఉన్న సందర్శకుల పుస్తకంలో లీ తన సందేశాన్ని రాసి సంతకం చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత దక్షిణ కొరియా దేశాధినేత భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

# రాజస్థాన్‌లోని రిఫైనరీ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభం కావాల్సిన రాజస్థాన్‌లోని రిఫైనరీ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రిఫైనరీలోని క్రూడ్ డిస్టిలేషన్ యూనిట్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. మంగళవారం ప్రధాని మోదీ అక్కడ పర్యటించి రిఫైనరీని ప్రారంభించాల్సి ఉండటంతో అక్కడ వేల మంది పోలీసులు మోహరించారు. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ కూడా సోమవారం సాయంత్రం రిఫైనరీని సందర్శించనున్నారని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని, అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టంపై అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు.



**2013లో సోనియాగాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపన**

బలోత్రాలోని ఈ రిఫైనరీని దేశపు తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దారు. హిందుస్థాన్ పెట్రోలియం, రాజస్థాన్ ప్రభుత్వం మధ్య జాయింట్ వెంచర్‌గా ఇది ఏర్పాటైంది. రాజస్థాన్‌లో అశోక్ గహ్లోత్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో 2013లో సోనియాగాంధీ ఈ రిఫైనరీకి శంకుస్థాపన చేశారు. అప్పుడు ప్రాజెక్ట్ వ్యయం రూ.43,129కోట్లు. అనంతరం జనవరి 16, 2018లో నరేంద్ర మోదీ ప్రభుత్వం దీనిని రీలాంచ్ చేసింది. ఈ మొత్తాన్ని రూ.79,459 కోట్లకు సవరించి ఈ ప్రాజెక్ట్ చేపట్టారు.

**దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ- పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటి!**

4,400 ఎకరాల్లో విస్తరించిన ఈ రిఫైనరీలో ఇంధనంతో పాటు భారీగా పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేస్తారు. ప్లాస్టిక్, వ్యవసాయ పైపులు, ప్యాకేజింగ్ ఫిల్మ్‌లు, ఆటో విడిభాగాలు, సింథటిక్ ఫైబర్, వైద్య పరికరాలు, పెయింట్లు, డిటర్జెంట్ల తయారీకి ఇక్కడ తయారయ్యే పెట్రోకెమికల్స్ ఉపయోగపడతాయి. ఇది మంగళవారం అందుబాటులోకి వస్తే దేశంలోని అతిపెద్ద అనుసంధానిత రిఫైనరీ- పెట్రో రసాయనాల కాంప్లెక్స్‌ల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు మొత్తం వార్షిక సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా ఇందులో పెట్రోరసాయనాల ఉత్పత్తుల సామర్థ్యం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది.

**రిఫైనరీ ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఆందోళన**

మరోవైపు రిఫైనరీలో జరిగిన అగ్నిప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రిఫైనరీ రాజస్థానీయులందరికీ గర్వకారణమైన ప్రాజెక్ట్ అని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఈ ప్రాజెక్ట్?ను ప్రారంభించనున్న తరుణంలో ప్రమాదం జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న వారందరూ సురక్షితంగా ఉండాలని గహ్లోత్? ఆకాంక్షించారు.

**ప్రధాని మోదీ పర్యటనకు సన్నాహాలు**

ఇదిలా ఉండగా ప్రధాని మోదీ పచ్‌పద్రలో రిఫైనరీని ప్రారంభించి బహిరంగ సభలో ప్రసంగించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ముగ్గురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (డీఐజీలు), 12 మంది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీలు), సుమారు 5,000 మంది పోలీస్? సిబ్బందిని మోహరించనున్నారు.

**వేదిక వద్ద 100కు పైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు**

రిఫైనరీ ప్రారంభోత్సవానికి హాజరయ్యే ప్రజలు సౌకర్యవం తంగా ఉండేందుకు విస్తృత ఏర్పాట్లు చేశామని జోధ్‌పూర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) సత్యేంద్ర సింగ్ తెలిపారు. "వివిధ జిల్లాలను కలుపుతూ ఆరు వేర్వేరు మార్గాల్లో పార్కింగ్ సౌకర్యాలు కల్పించాం. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ మళ్లింపులు కూడా అమలు చేశాం" అని ఆయన అన్నారు. కార్యక్రమ వేదిక వద్ద కార్యక లాపాలను పర్యవేక్షించేందుకు 100కు పైగా సీసీటీవీ కెమెరా లను ఏర్పాటు చేసినట్లు ఐజీపీ సత్యేంద్ర సింగ్ తెలిపారు.

## వచ్చే 4,5 రోజులు నిప్పుల కొలిమే

దేశంలో ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. కాగా రానున్న నాలుగైదు రోజుల పాటు దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు (హీట్ వేవ్స్) వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. ముఖ్యంగా ఏప్రిల్ 20 నుంచి ఏప్రిల్ 25 మధ్య వివిధ తేదీల్లో హరియాణా, చండీగఢ్, దిల్లీ, పంజాబ్, తూర్పు రాజస్థాన్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్, మధ్యప్రదేశ్, గంగానది పరివాహక పశ్చిమ బంగాల్, ఝార్ఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. "ఏప్రిల్ 20-26 మధ్య గంగా పరివాహక పశ్చిమ బంగాల్; ఏప్రిల్ 20-22 మధ్య తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్; ఏప్రిల్ 20-24 మధ్య కేరళ, మాహే, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, యానాం; ఏప్రిల్ 24, 25 తేదీల్లో గుజరాత్ తీర ప్రాంతాల్లో ఉక్కపోతతో కూడిన వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని" ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 20, 21 తేదీల్లో హరియాణా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, విదర్భ ప్రాంతాల్లోనూ, ఏప్రిల్ 20న ఛత్తీస్‌గఢ్, ఏప్రిల్ 20-22 మధ్య ఒడిశాలో రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని ఐఎండీ వెల్లడించింది.

**ఉరుములతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు**

మరోవైపు సోమవారం నాడు దక్షిణ, మధ్య, తూర్పు, వాయువ్య భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మోస్తరు నుంచి తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అలాగే సోమవారం- మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

**ఈశాన్య రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు**

ఇక ఈశాన్య రాష్ట్రాల విషయానికి వస్తే, అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో ఏప్రిల్ 23 వరకు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తాయని తెలిపింది. కొన్ని చోట్ల మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిపిస్తాయని పేర్కొంది. అదే విధంగా నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపురల్లోనూ ఏప్రిల్ 22 వరకు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని అంచనా వేసింది. ఐఎండీ ప్రకారం, అరుణాచల్ ప్రదేశ్‌లో ఏప్రిల్ 20, 21 తేదీల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావచ్చని, రవాణా సౌకర్యాలకు కూడా అంతరాయం కలగవచ్చని పేర్కొంది. అంతేకాదు స్థానికంగా వరదలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. కొన్ని కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక దేశంలోని ఇతర ప్రాంతాల విషయానికి వస్తే, పశ్చిమ హిమాలయ ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో హిమపాతం, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వెస్ట్రన్ డిస్టర్బెన్సెన్స్, చక్రవాత పరిభ్రమణాల వంటి వివిధ వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయని ఐఎండీ తెలిపింది.

**వేసవిలో ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

వేసవి ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో చిన్నపిల్లలు, వృద్ధులు సహా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లడం మంచిది కాదని చెబుతున్నారు. ఎందుకంటే ఆ సమయంలో సన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చెమట రాకపోవడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. సన్ స్ట్రోక్ బ్రెయిన్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో నిర్లక్ష్యం చేయొద్దని సూచిస్తున్నారు.

## 'లారక్ ద్వీపానికి దూరంగా ఉండండి'

పర్షియన్ గల్ఫ్? ప్రాంతంలోని భారతీయ చమురు నౌకలకు తాజాగా ఇండియన్ నేవీ అడ్వైజరీ జారీ చేసింది. భద్రతా కారణాల రీత్యా లారక్ ద్వీపం పరిసరాలకు దూరంగా ఉండాలని సూచించింది. భారత నౌకాదళం ఆదేశించినప్పుడు మాత్రమే ప్రయాణించాలని సూచించింది. ఏప్రిల్? 18న ఇరాన్?కు చెందిన ఇస్లామింక్? రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్? (ఐఆర్?జీసీ) రెండు భారతీయ నౌకలపై కాల్పులు జరిపిన నేపథ్యంలో, భారత నౌకాదళం తాజాగా ఈ అడ్వైజరీ జారీ చేసింది. మరోవైపు హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకాదళం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. హర్మూజ్ జలసంధిని దాటేందుకు వేచి ఉన్న అన్ని భారతీయ నౌకల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంది.

**11 నౌకలు దాటాయ్**

ఇప్పటి వరకు 11 భారతీయ నౌకలు ఈ హర్మూజ్ జలసంధిని దాటాయి. ఏప్రిల్ 18న 'దేశ్ గరిమ' అనే చివరి ట్యాంకర్ ఈ జలసంధిని దాటింది. అదే రోజు 'జగ్ అర్నవ్', 'సన్మార్ హెరాల్డ్' అనే 2 భారతీయ నౌకలు ఈ జలసంధిని దాటేందుకు ప్రయత్నించగా, ఇరాన్ కాల్పులు జరపడంతో అవి వెనక్కి మళ్లాల్సి వచ్చింది. దీనితో ఈ కాల్పుల ఘటనను భారత విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీని పిలిపించి నిరసన వ్యక్తం చేసింది. కాగా, ప్రస్తుతం హర్మూజ్‌ను దాటిన 'దేశ్ గరిమ' నౌకకు అరేబియా సముద్రంలో భారత నౌకాదళం ఎస్కార్ట్ (రక్షణ) కల్పిస్తోంది. ఇది బహుశా ఏప్రిల్ 22న ముంబయికి చేరుకోవచ్చని భావిస్తున్నారు.

## అమెరికాతో రెండో విడత చర్చలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు



అమెరికాతో జరగాల్సిన రెండో విడత చర్చల్లో పాల్గొనడంపై ఇప్పటివరకు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సోమవారం ఇరాన్ స్పష్టంచేసింది. వాషింగ్టన్ నుంచి వైరుధ్యపూరిత చర్యలు ఎదురవుతున్నాయని, ఈ నేపథ్యంలోనే ఈ వైఖరి తీసుకున్నట్లు తెలిపింది. టెహ్రాన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘేయి ఈ విషయాలు వెల్లడించారు. తదుపరి చర్చల గురించి తాము ఇంకా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని ఆయన స్పష్టంగా చెప్పారు. దౌత్య మార్గాన్ని అనుసరిస్తున్నామని చెబుతూనే అమెరికా ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి విమర్శించారు. కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం నుంచే అమెరికా నుంచి తమకు వ్యతిరేకత ఫిర్యాదులు ఎదురయ్యాయని బాఘేయి పేర్కొన్నారు. తాజాగా ఆదివారం రాత్రి హర్మూజ్ జలసంధిలో ఇరాన్ వాణిజ్య నౌకపై అమెరికా దాడి చేసిందని, ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, దురాక్రమణ చర్య అని ఆరోపించారు. కాగా అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఇరాన్ కార్గో షిప్‌ను అడ్డగించి, స్వాధీనం చేసుకున్నామని ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని బఘేయి ప్రస్తావిస్తూ.. అమెరికా చర్యల్లోని ఈ అస్థిరత, చర్చల ప్రక్రియపై తమకున్న అపనమ్మకాన్ని మరింత పెంచుతోందని అన్నారు. గతంలో అమెరికా రెండుసార్లు దౌత్యానికి ద్రోహం చేసిందని, తమ సార్వభౌమత్వంపై దాడి చేసిందని గుర్తుచేశారు. ఈ అనుభవాలను విస్మరించలేమని, జాతీయ ప్రయోజనాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే భవిష్యత్ మార్గంపై నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. మంగళవారం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో చర్చలు ఉంటాయని ట్రంప్ చెబుతున్న నేపథ్యంలో.. ఇరాన్ తాజా ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# మే చివరి నాటికి బ్యారేజీల మరమ్మతులు పూర్తి కావాల్సిందే!

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ చర్యల్లో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. మేడిగడ్డ కుంగుబాటు, ఇతర లోపాలు తలెత్తిన బ్యారేజీల పునరుద్ధరణకు కావాల్సిన డిజైన్లను సిద్ధం చేసుకుంటోంది. ప్రధానంగా బోర్ల తవ్వకంపైనే కీలక సమాచారం ఆధారపడి ఉన్నట్లు నిపుణులు సూచిస్తుండడంతో రోటర్ టైప్ డ్రిల్లింగ్ విధానంలో ముమ్మరంగా తవ్వకాలు చేస్తున్నారు. ఈ తరహా యంత్రాలు దేశవ్యాప్తంగా పరిమిత సంఖ్యలో ఉండటంతో వాటిని సమకూర్చుకునే పనిలో ఇంజినీర్లు బిజీగా ఉన్నారు. వీలైనన్ని మెషిన్లు ఏర్పాటు చేసి, వేగంగా పరీక్షలు పూర్తి చేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షల్లో సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.



### అతి జాగ్రత్తగా పరీక్షలు

మేడిగడ్డ బ్యారేజీలో 2023 అక్టోబర్?లో ఏడో బ్లాకులో పియర్స్ కుంగుబాటుకు లోనయ్యాయి. అప్పటి నుంచి బ్యారేజీ ఆపరేటింగ్‌ను పూర్తిగా నిలిపివేశారు. దీంతో బ్యారేజీల వద్ద పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేసింది. కుంగిన ప్రాంతాల్లో పునాదుల్లోకి ఇసుక, నీటి ప్రవాహం వెళ్లి చేరింది. ఇప్పుడు ర్యాఫ్ట్ వద్ద బోర్ డ్రిల్లింగ్‌లను చేపట్టారు. బోర్ తవ్వకాలతో ఇప్పటికే కదిలిన నిర్మాణాలు మళ్లీ కుదుపునకు లోనయ్యే వీలుంటుంది. అందుకే రోటర్ టైప్ మెషిన్లను వినియోగిస్తున్నారు. బ్యారేజీల్లో కాంక్రీట్ పటుత్వంపై పరీక్ష? : ఒక్కో అడుగును అతి జాగ్రత్తగా తవ్వుకుంటూ వెళ్తున్నారు. మూడు బ్యారేజీల్లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో ఏక కాలంలో తవ్వకాలు చేపట్టాలంటే 100కు పైగా మెషిన్లు అవసరమని ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరోవైపు బ్యారేజీల్లో కాంక్రీట్ ఎంత పటుత్వంగా ఉంది, ఇతరత్రా లోపాలు ఇంకా ఏవైనా ఉన్నాయా అనేది భూ భౌతిక, టెక్నికల్ పరీక్షల ద్వారా గుర్తించనున్నారు. ఇందులో అనుభవం ఉన్న సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల నేతృత్వంలో ఈ టెస్టులను నిర్వహిస్తున్నారు. మే నెలాఖరు వరకు ఓ అంచనా : అధునాతన గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ స్కానింగ్, ఎలక్ట్రో రెసిఫినిటీ టెస్ట్, డ్రోన్ సర్వేలు చేయనున్నారు. ఎన్జీఆర్ఐ (నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) సహకారం కూడా తీసుకుంటున్నారు. బ్యారేజీల పునరుద్ధరనకు ఏం చేయాలనేది మే నెలాఖరు నాటికి ఒక అంచనాకు వచ్చే అవకాశాలు ఉంటాయని నీటి పారుదల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అప్పటిలోగా పరీక్షలు పూర్తవుతాయని, ఆ ఫలితాల ఆధారంగా డిజైనర్ కన్సల్టెంట్ ఆఫ్రి ఇండియా పునరావాస డిజైన్లు రూపొందించే అవకాశం ఉంది. దీనికి ఐఐటీ ముంబయి ఎక్స్పర్ట్స్ సహకరించనున్నారు. వానాకాలంలో డిజైన్లు సిద్ధం చేసుకుని మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీని ఈరోజు సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో గోదావరి నదిపై ఉన్న ఈ బ్యారేజీ రెండున్నరేళ్ల కింద కుంగడంతో ప్రభుత్వం పునరుద్ధరణ చర్యలు చేపట్టిన నేపథ్యంలో సీఎం పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పరీక్షలు సహా ఇతర పనులను సీఎం పరిశీలిస్తారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ అప్పట్లో బుంగలు పడినటువంటి లోపాలు వెలుగుచూశాయి. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాల మేరకు నీటిపారుదలశాఖ బ్యారేజీల పునరుద్ధరణ చర్యలను జాగ్రత్తగా చేపడుతోంది.

### తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పి

ఇటీవల హైదరాబాద్‌లో మేడిగడ్డ బ్యారేజీ పనులపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో పునరుద్ధరణ, పునరావాస చర్యల్లో వేగం పెంచాలని, ఇతర రాష్ట్రాల నుంచి అవసరమైన మెషిన్లు తెప్పించాలని సీఎం ఆదేశించారు. తాను స్వయంగా పనులను పరిశీలిస్తానని అధికారులకు ఆనాడే చెప్పారు. ఈ మేరకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరుగుతున్న బోర్ డ్రిల్లింగ్, ఇతర పనులను ఈరోజు చూడనున్నారు. అనంతరం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి డ్యాం సైట్‌లో అధికారులతో సీఎం సమావేశమై సమీక్ష చేయనున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాల బీభత్సం

-మొదటిపేజీ తరువాయి

ఆరబోస్తే వరదలో కొట్టుకోపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా నిజామాబాద్ జిల్లాలో సాయంత్రం వేళ ఈదురుగాలులతో పాటు వడగళ్లతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం ఎండలు దంచి కొట్టడం, సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మార్పు చెంది వర్షం పడటం సర్వసాధారణంగా మారింది. ఈ అకాల వర్షాలతో కోతకు సిద్ధమైన మొక్కజొన్న, వరి పంట నేలవాలగా, రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలివాన ధాటికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని సిరికొండ, డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, ధర్పల్లి మండలాల్లో వర్షం బీభత్సానికి చేతికొచ్చిన పంట మొత్తం నేలపాలైంది.



### నీటి పాలైన ధాన్యం

ఇందల్‌వాయి, చాంద్రాయన్?పల్లి, సిర్నపల్లి, సిరికొండ, కుర్దుల్‌పేట్‌తో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీటి పాలైంది. ఆరుకాలం కష్టపడి పండించిన పంట వరద పాలవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఎగిరిపడిన పైకప్పులు

మెదక్ జిల్లా రామాయంపేటలో సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లో ఈదురు గాలులకు చెట్లు నేల కూలాయి. ఝరాసంగం మండలం జీర్లపల్లి, చిలేమామిడి గ్రామాల్లో రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరి పడిపోయాయి. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, బాలానగర్ జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, సూరారం, గండమైసమ్మ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చింతల్, పద్మనగర్?లో వేర్లతో సహా భారీ వృక్షం నేలకొరికింది. చెట్టు ధాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరగడంతో, వాటి కింద ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.

నా ఆరెకరాల పొలం అకాల వర్షం ధాటికి నాశనమైంది. విత్తు లేకుండా పూర్తిగా రాలిపోయింది. కేవలం గడ్డి మాత్రమే మిగిలింది. దీనిని ఏం చెయ్యాలో కూడా అర్థం కావడం లేదు. పంట పాడవకుండా ఉండేందుకు రూ.70 వేలు ఖర్చు చేసి రెండుసార్లు మందు కొట్టాం. మేం చేయాల్సిందంతా చేశాం. సాయంత్రం 4.30కు గాలి వీచింది. 5 గంటల వరకు వర్షం పడింది. అకాల వర్షం కారణంగా చేతికందిన పంట నేలపాలైంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి" వడ్లన్నీ కొట్టుకుపోయాయి : అకాల వర్షంతో తమ పంట మొత్తం నాశనం అయిపోయిందని ఓ రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై దయ ఉంచి ఆదుకోవాలని వేడుకున్నారు. 6 నెలలు కష్టపడి పండించిన పంట వడగళ్ల వాన కారణంగా ఒక్కసారిగా నేలపాలైందని తెలిపారు. మరో వ్యక్తి వడగళ్ల వాన కారణంగా భారీగా నీరు ప్రవహించిందని చెప్పుకొచ్చారు. దీంతో వడ్లన్నీ కొట్టుకుపోయాయని తెలిపారు. తనకు రెండు ట్రాలీల వడ్లు మాత్రమే మిగిలాయని చెప్పారు. దానిలో 10 సంచుల వరకు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయని వివరించారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.

## ఢిల్లీకి హరీశ్‌రావు బృందం.. కాళేశ్వరం కమిషన్‌పై న్యాయపరమైన చర్చలు

పార్టీ ఫిరాయింపులు, కాళేశ్వరం కేసుల నేపథ్యంలో న్యాయపరమైన చర్చల కోసం బీఆర్ఎస్ త్రిసభ్య బృందం ఢిల్లీకి చేరుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం సీనియర్ న్యాయవాదులతో హరీశ్‌రావు, వినోద్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర సమావేశం కానున్నారు. కాళేశ్వరంపై రేపు తెలంగాణ హైకోర్టులో తీర్పు రానుంది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల కేసు, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై బీఆర్ఎస్ త్రిసభ్య బృందం చర్చించనుంది. ఒకవేళ హైకోర్టులో తీర్పు వ్యతిరేకంగా వస్తే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసే అవకాశం ఉంది. దీనిపై కూడా న్యాయవాదులతో చర్చించనున్నారు

## ఎంఎంటీఎస్ లలో మహిళలకు ఫ్రీ...

### ఏడాదికి 10 కోట్లు ఇస్తామంటున్న సర్కార్

**హైదరాబాద్ :** హైదరాబాద్ సిటీలో రోజురోజుకూ ట్రాఫిక్ ఊహించని రీతిలో పెరుగుతోంది. దాంతో హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం కల్పించాలని సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ సిటీలో నిరంతరం పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా నగర ప్రజలకు పర్యావరణహితమైన, చౌకైన ప్రజారవాణాను అందుబాటులోకి తెచ్చేందుకు ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికీ ఉచిత ప్రయాణం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ విప్లవాత్మక నిర్ణయం వల్ల సామాన్యులపై రవాణా భారం తగ్గడమే కాకుండా, నగరంపై వ్యక్తిగత వాహనాల ఒత్తిడి కూడా తగ్గుతుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి ఈ పథకాన్ని ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.ఈ ప్రతిష్టాత్మక పథకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, సీఎస్ రామకృష్ణారావు సహా కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో ఇప్పటికే చర్చలు జరిపారు. ప్రస్తుతం ఎంఎంటీఎస్ రైళ్ల ద్వారా లభిస్తున్న సుమారు రూ. 10 కోట్ల వార్షిక ఆదాయాన్ని, ప్రయాణికుల సంఖ్యతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేసింది. గతంలో రోజుకు 1.20 లక్షల మంది ప్రయాణించినా, ప్రస్తుతం సరైన సమయపాలన, ఫ్రీక్వెన్సీ లేకపోవడంతో ఆ సంఖ్య కేవలం 40 వేల లోపునకు పడిపోయింది. ఈ ఆదరణను తిరిగి పెంచేందుకు, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు, వ్యక్తిగత వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పకడ్బందీ వ్యూహాన్ని రచించింది.హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, పురపాలక అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ దక్షిణ మధ్య రైల్వే శాఖకు రాసిన లేఖలో పలు కీలక సూచనలు చేశారు. రద్దీ సమయాల్లో రైళ్ల సంఖ్యను పెంచడం, రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలను మెరుగుపరచడం వంటి అంశాలను ప్రస్తావించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంఎంటీఎస్ సర్వీసులపై ఇటీవల సమీక్షించారని రైల్వే జీఎంకు రాసిన లేఖలో తెలిపారు. రద్దీ వేళల్లో ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు పెంచాలని, స్టేషన్లలో సౌకర్యాలు మెరుగు పరచాలని కోరారు. అంతేకాకుండా, ప్రయాణికులకు 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'ని అందించడానికి రైల్వే స్టేషన్ల నుండి ఇంటికి చేరుకునేలా ఆర్టీసీ షటిల్ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందుకోసం స్టేషన్ ప్రాంగణాల్లో అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు.దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, ముసాయిదా ఎంవోయూ పంపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు ఇవ్వాల్సిన రూ.491.45 కోట్లు చెల్లించాలని సైతం కోరింది. రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం అనుమతులు లభించిన వెంటనే, రైళ్ల సమయాలు, నిర్వహణపై స్పష్టత రానుంది. ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించిన నిధుల చెల్లింపు అంశం కూడా ఈ చర్చల్లో ప్రముఖంగా నిలిచింది.

## ఆ ఇద్దరి పేర్లు ఆమోదించండి

-మొదటిపేజీ తరువాయి

దీంతో పాటు విద్యారంగానికి సంబంధించి పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లుగా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును పట్టి పిడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా లోక్?భవన్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తెలంగాణ యువతను,విద్యా వ్యవస్థను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం, లోక్ భవన్ కలిసి కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో గవర్నర్ పలు నిర్మాణాత్మక సూచనలు చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. విద్యార్థులు విద్యాసంస్థల్లో అడుగుపెట్టే తొలి రోజే డ్రగ్స్?కు వ్యతిరేకంగా దృఢ నిశ్చయంతో ఉండాలని గవర్నర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ పొందే సమయంలోనే 'మేము మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం వాటిని ప్రోత్సహించం' అని విద్యార్థుల నుంచి అధికారికంగా ప్రమాణ పత్రం తీసుకోవాలని సూచించారు.

### సీఎంకు పలు కీలక సూచనలు చేసిన గవర్నర్

విద్యాసంస్థల్లో కేవలం చదువు మాత్రమే కాకుండా, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై నిరంతరం అవగాహన కల్పించాలని, విద్యార్థులతో సామూహిక ప్రమాణాలు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డికి గవర్నర్? సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై రాష్ట్రస్థాయిలో చైతన్యం తీసుకురావడానికి జూన్ 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు, యువతకు డ్రగ్స్ లేని సమాజం ప్రాముఖ్యతను వివరించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలపై రేవంత్ రెడ్డితో గవర్నర్ చర్చించారు. కేవలం డ్రగ్స్ అంశమే కాకుండా, రాష్ట్రంలోని విద్యా రంగంలో మౌలిక వసతులు, యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న విద్యావేత్తల పోస్టులు, ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలపై భేటీలో చర్చకు వచ్చినట్లుగా తెలిసింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా విద్యా సంస్థల పనితీరు ఉండాలని పేర్కొన్నారు.

గవర్నర్ చేసిన ప్రతిపాదనల పట్ల రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు. ఆయన సూచించిన విధంగా అడ్మిషన్ల సమయంలో అఫిడవిట్లు తీసుకోవడం, విద్యార్థులతో ప్రమాణం చేయించడం వంటి అంశాలను తక్షణమే అమలు చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జూన్ 12న జరగబోయే కార్యక్రమానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

### ఎమ్మెల్సీల నియమాకం విషయంలో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి నెలకొన్న ఉత్కంఠను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న మహమ్మద్ అజారుద్దీన్ పదవికి ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. రాజ్యాంగం ప్రకారం, ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ కాకుండా మంత్రిగా ప్రమాణం చేసిన వ్యక్తి, ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ మంత్రి పదవి చేపట్టి ఈ నెల 30 నాటికి ఆరు నెలలు పూర్తి కానున్నాయి. ఒకవేళ ఈలోగా గవర్నర్ ఆయన ఎమ్మెల్సీ నియామక ఫైల్‌పై సంతకం చేయకుంటే, ఆయన తన మంత్రి పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది.శనివారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గవర్నర్‌ను కలిసి రాజ్యాంగపరమైన చిక్కులు రాకుండా వివరణ ఇచ్చారు. గతంలో కోర్టులో ఉన్న సాంకేతిక ఇబ్బందులు తొలగిపోయినందున, తక్షణమే ఆమోద ముద్ర వేయాలని గవర్నర్?ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## మళ్లీ వచ్చేది 100 శాతం బీఆర్ఎస్ ప్రభుత్వమే

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడితే తెలంగాణ అనొద్దని నాడు దాడి చేసిన్రు. చంద్రబాబు నాడు కరెంట్ ఛార్జీలు పెంచితే నేను ఉత్తరం రాశా. తెలంగాణా ఉద్యమం చేస్తానని హెచ్చరించా. బషీర్ బాగ్ లో రైతులపై కాల్పులు జరిపిన బాబు పాలనపై ధ్వజమెత్తి ఉద్యమాన్ని ఆరంభించాను. రోషయ్య 14 ఎఫ్ అని ఓ జీవో తెచ్చి తెలంగాణ వారికి ఉద్యోగాలు రాకుండా అడ్డుకున్నారు. ఆనాడే ఆమరణ దీక్షకు బయల్దేరా. చిదంబరం ప్రకటన తర్వాత హైడ్రామా క్రియేట్ చేశారు. వచ్చిన తెలంగాణాకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు క్లిష్టమైన విషయం. బిహార్ లో పని చేస్తున్న జీఆర్ రెడ్డి అనే చొప్పదండి ఇంజనీర్ ను పిలిపించుకుని ప్రణాళిక రూపొందించుకున్నాం. మిషన్ కాకతీయ వంటి అద్భుతమైన పథకాలు తీసుకొచ్చాం. మిషన్ భగీరథ పూర్తి చేయకుంటే ఓట్లడగనని చెప్పిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా.. నేను తప్పు..?' అని వ్యాఖ్యానించారు.

### 100% బీఆర్ఎస్ గవర్నమెంటే వస్తది..

చీకట్లో దడుసుకుంటే చెట్టే నీ చుట్టూరా భయపెడతదంటూ జగిత్యాల దివంగత కవి అలిశెట్టి ప్రభాకర్‌ను గుర్తు చేసుకున్నారు కేసీఆర్. 'జీవన్ రెడ్డి జగిత్యాలకు మాత్రమే పరిమితమైన నాయకుడు కాదు.. ఆయనకు రాష్ట్ర వ్యాప్తంగా పేరుంది. నేను ముఖ్యమంత్రి అయ్యాక కరీంనగర్ లో నన్ను బోర్నపల్లి గురించి అడిగిండు. తన నియోజకవర్గం పట్ల జీవన్ రెడ్డి కన్సర్న్ ఏంటో అందరికీ తెలిసిందే. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరితే మంచి ప్రభావం ఉంటుందని సర్వేల్లో కూడా చాలా మంది చెప్పారు. నేను, జీవన్ రెడ్డి ఇకపై ఒక కుటుంబంలా, అన్నదమ్ముల్లా పని చేయనున్నాం. నూరు శాతం బీఆర్ఎస్ గవర్నమెంటే వస్తది. జీవన్ రెడ్డిని మంచి పదవిలో చూస్తారు' అని కేసీఆర్ తెలిపారు.

### నూటినూరు శాతం మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

నూటినూరు శాతం మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘాటించారు. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ చాలా భయంకరమైన పరిస్థితుల్లో ఉండే, దుఃఖం వచ్చేది ఎమ్మెల్యేలుగా ఉన్న ఏం చేయలేని పరిస్థితి.. ఆగమాగం. ఎట్లుండె తెలంగాణ. తెలంగాణ రాకముందు ఎంత భయంకరమైన బాధలుండే.. ఎంత కష్టముండే.

అసెంబ్లీలో వరంగల్ ఎమ్మెల్యే ఉండే ఏదో విషయంలో ఆయన మాట్లాడపోతే .. ఏ అసెంబ్లీలో తెలంగాణ అని మాట్లాడొద్దు.. అనొద్దు.. నిషేధం. అంత భయంకరమైన వివక్ష. మన భాష, మన బతుకు మీద, మన నీళ్ల మీద దాడి, మన ఉద్యోగాల మీద మన వనరుల మీద, మన ఆస్తుల మీదమొత్తం దోపిడీ చేయడం తప్ప ఇక్కడి ప్రజలను బికారీల్లాగా వదిలిపెట్టారని కేసీఆర్ అన్నారు.

### గంజి కేంద్రాలు పెట్టేవాళ్లు..

రైతాంగం ఆగమాగమైపోయి చెట్టుకొకలు పుట్టుకొకరు అయిపోయారని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ కాలువ ఉన్నట్వంటి జగిత్యాల, మెట్‌పల్లి, చొప్పదండి ప్రాంతాల నుంచి కూడా దుబాయికి, బొంబాయికి వలసలు, పాలమూరు జిల్లా అయితే భయంకరమైన వలసలు. కొన్ని పార్టీలు చేసే పని చూస్తే బాధ కలిగేది. మహబూబ్‌నగర్ జిల్లాలో నూటికి 90 మంది యువకులు వలస. బతుకాలంటే బతుకపోవాలే. అక్కడ బతుకు లేదు. ఉన్న ముసలోళ్లకు వాళ్లు డబ్బులు పంపిస్తే కంట్రోల్ బియ్యం కొనుక్కొని తిని బతకాలి. అండ్ల కొంతమందికి అందకపోతే కొన్ని పార్టీల వాళ్లు తామేదో గొప్పతనం చేసినట్టు గంజి కేంద్రాలు పెట్టేవాళ్లు. అంత అధ్వాన్న స్థితికి తెలంగాణను దిగజార్చారు. అది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వం కావొచ్చు. మంచినీళ్లు ఇయ్యలె. కరెంట్ ఇయ్యలె. మనదగ్గర నిలదీసే నాయకులు లేరు. అందరూ కట్టుబానిసలైపోయారు. ఆ పరిస్థితుల్లో మూలిగే నక్క మీద తాటికాయ ఆనాడున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడ్డగోలుగా కరెంట్ చార్జీలు పెంచిండు. తెల్లారే నేనొక ఉత్తరం రాసిన. నీ కరెంట్ చార్జీల పెంపుదల వాపసు తీసుకో. లేకపోతే ఈ సమైక్య రాష్ట్రంలో మాకు న్యాయం జరుగదని నేను తెలంగాణ ఉద్యమానికి పోవాల్సి వస్తదని చెప్పిన. ఆయన తీసుకోలేదు. కొంతమంది రైతులు పోరాటానికి హైదరాబాద్‌కు వస్తే పట్టపగలు 11:30 గంటలకు విచ్చలవిడిగా కాల్చి చంపేస్తే ముగ్గురు రైతులు అక్కడికక్కడే చనిపోయారు. ఇక లాభం లేదు. ఆ తర్వాత నిర్ణయం తీసుకున్నం. ఎదురు తిరిగితే వీళ్లు కాల్చి చంపారు. జెండా ఎత్తడం తప్ప మార్గం లేదని చెప్పి ఆనాడు తెలంగాణ ఉద్యమానిక శ్రీకారం చుట్టినం. వెంబడి ఎవరు వచ్చినా రాకున్న ఆరే ప్రజలున్నరు.. యువకులున్నరు అని బయలు దేరిన అని కేసీఆర్ అన్నారు.

# సంపాదకీయం

## పాలనా యంత్రాంగానికి వెన్నెముకలు పౌర సేవలు

జాతీయ పౌర సేవల దినోత్సవం ఏప్రిల్ 21న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. భారత పౌర సేవలు, (సివిల్ సర్వీసెస్) అంటే ప్రభుత్వ అధికా రులు దేశానికి, ప్రజలకు చేసే సేవలు. భారత పరిపాలనా వ్యవస్థ లో ఈ "భారత పౌర సేవలు" అతిముఖ్య రంగం. భారతీయ పార్లమెంటరీ ప్రజాతంత్ర వ్యవస్థలో పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిం చే గురుతర బాధ్యత ఈ రంగానిది. ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు ప్రభుత్వంలో ఉంటూ మంత్రులుగా వ్యవహరిస్తారు. అలా కొద్ది మంది ప్రజా ప్రతినిధులు పరిపాలన సాగించడం సాధ్యం కాని విషయం. సేవారంగంలో గల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే బాధ్యతను పౌర సేవల అధికారు లు నిర్వర్తిస్తారు. ప్రభుత్వ ప్రతినిధులుగా శాసన కర్తలుగా, మంత్రులు పాలసీలను తయారు చేస్తే, సేవారంగం వాటిని అమలు పరుస్తుంది.పౌర సేవల వ్యవస్థ పరిపాలన యంత్రాంగానికి వెన్నుముక లాంటిది. ఇది రిపబ్లిక్ ఆఫ్ ఇండియా శాశ్వత కార్యనిర్వాహక శాఖ. ప్రభుత్వం రూపొందించిన విధానాలను, పథకాలను క్షేత్ర స్థాయిలో విజయ వంతంగా అమలు జరిపే బాధ్యత పౌర సేవకులదే. పౌర సేవల విభాగాలు మూడుగా విభజింప బడ్డాయి. ఇవి రాజ్యాంగ అధికారాలచే ఏర్పాటు చేయబడ్డాయి. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) లతోపాటు సెంట్రల్ గ్రూప్ ఏ అండ్ గ్రూప్ బీ తదితర సర్వీసులు. ప్రస్తుతం అమలులో వున్న భారత పౌరసేవా రంగం (ఇండియన్ సివిల్ సర్వీసెస్) పూర్వ బ్రిటీషు ఇండియా భారత ప్రజా సేవ విధానాలపై ఆధారపడి భారత విభజన జరిగిన 1947 తరువాత నుండి అమలులోకి వచ్చింది.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రజలు వారివారి ప్రాథమిక హక్కులను పొందేలా చూడాలన్న ఉద్దేశ్యంతో జాతీయ పౌర సేవల సంస్థ 2016, ఏప్రిల్ 21 ఈ పౌర సేవల దినోత్సవాన్ని ప్రారంభించింది. పౌర సేవల అధికారుల పనుల కార్యక్రమాలను ప్రోత్సహిం చేందుకు, ప్రశంసిం చేందుకు పౌర సేవలం దినోత్సవాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ కాలంలోనే పౌర సేవలు అనే పదం పుట్టింది. వారన్ హెస్టింగ్స్, చార్లెస్ కార్న్ వాలిస్, ఈ సేవలకు పునాదులు వేశారు. బ్రిటిష్ రాజ్ నుంచి పూర్తిగా స్వేచ్ఛ విముక్తులైన తర్వాత అడ్మినిస్ట్రేటివ్ విధానాన్ని పరిపాలనా విభాగం చూసు కునేది. భారతీయుల పౌర సేవల స్థానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులను తీసుకొచ్చారు.బ్రిటిష్ పాలనలో ఉన్న ఇండియన్ సివిల్ సర్వీస్ భారత స్వతంత్ర ప్రతిపత్తి అనంతరం ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ గా మారింది. ఏప్రిల్ 21, 1947న స్వదేశీ పార్లమెంటు సభ్యుడు సర్దార్ వ్లభాయ్ పటేల్ అఖిల భారత సేవలను ప్రారంభిం చారు.1947లో ఢిల్లీలోని మెట్‌కాల్ఫ్ హౌస్‌లో స్వతంత్ర భారత తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రొబేషనర్లను ఉద్దేశించి ప్రసంగించిన రోజు జ్ఞాపకార్థం ఈ తేదీని ఎంచుకున్నారు. అతను సివిల్ సర్వెంట్లను స్టీల్ ఫ్రేం (ఉక్కు చట్రం) ఆఫ్ ఇండియాగా పేర్కొన్నాడు. అటువంటి మొదటి కార్యక్రమం 21 ఏప్రిల్ 2006న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. పౌర సేవల అధికారులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, పబ్లిక్ రంగ సంస్థలలో పట్టున్న, వ్యూహాత్మక స్థానాలున్నవారు. ఈ అధికారులు ప్రభుత్వ విధానాలను అమలు పరచి పర్యవేక్షిస్తారు. ప్రభుత్వం వారు చేపట్టే పనులకు, విధానాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉన్నతమైన సేవలందిం చిన వ్యక్తులకు బృందాలను పురస్కారాలను ప్రదానం చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన చాలా నుంది. అధికారులకు వారి అసాధారణమైన సేవలకు గుర్తింపుగా ప్రధాన మంత్రి పురస్కారాన్ని ఇస్తారు. అత్యుత్తమ సేవలను అందించిన వారికి "ప్రధాన మంత్రి "అవార్డును ఇస్తారు. పౌర సేవల విషయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటానికి భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలోనన్న అంశంపై పౌర సేవల ఉద్యోగులకు శిక్షణా కార్యాక్రమాలు నిర్వహించ బడుతాయి. పౌర సేవల గురించి, పౌరుల హక్కుల గురించి గ్రామస్థాయిలో గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కలిపిస్తారు.విశ్వవిద్యాలయ పట్టభద్రులు, పైబడి విద్యగల వారిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యు.పి.ఎస్.సి) ఒక ప్రత్యేక పరీక్షా విధానం ద్వారా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహించి అర్హత పొందినవారిని ఆయా సేవా రంగాలలో నియమిస్తారు.ముఖ్యమైన కార్యక్రమాలకు వినూత్న ఆవిష్కరణలకు చెందిన కేటగిరీలలో పురస్కారాలను ఇస్తుంటారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ కౌసల్ యోజన, నమామి గంగే యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్, డిజిటల్ చెల్లింపుల వంటి కీలక కార్యక్రమాల అమలు ప్రాతి పదికన అవార్డుల ప్రదానం చేస్తారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నవీన భారతానికి ఎంతో కీలకంగా ఉంటున్నాయి. నూతన భారత కలలను సాకారం చేసేందుకు ఈ అవార్డులను ప్రోత్సాహకంగా అందిస్తున్నారు.

## హిమగిరి శిఖరాన హరిహర నివాసం

# చార్ ధాం పవిత్ర దర్శనం



భారతీయ ఆధ్యాత్మిక వైభవం, హిమాలయాల అచంచల ప్రశాంతత, మరియు మానవ అంతర్మథనం కలబోసిన అద్భుత ఆధ్యాత్మిక మహాక్రతువు 'చార్ ధాం యాత్ర'. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం, మానవ జన్మ ధన్యమవ్వాలన్నా, సంసార సాగరంలోని కర్మబంధాల నుండి విముక్తి పొంది మోక్షాన్ని ఆస్వాదించాలన్నా చార్ ధాం దర్శనం అనివార్యమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయ శ్రేణులలో కొలువై ఉన్న యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ అనే నాలుగు పుణ్యక్షేత్రాల సమాహారమే ఈ యాత్ర. ఇది కేవలం భౌగోళిక ప్రయాణం కాదు, భౌతిక ప్రపంచం నుండి ఆధ్యాత్మిక ప్రపంచానికి సాగే ఒక అంతర్ ప్రయాణం. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు ఈ యాత్ర తన ప్రాముఖ్యతను నిలుపుకుంటూ, కోట్లాది మంది భారతీయుల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది.? చార్ ధాం యాత్ర ప్రాశస్త్యాన్ని పరిశీలిస్తే, దీని మూలాలు పురాణ కాలంలోనూ మరియు ఎనిమిదవ శతాబ్దానికి చెందిన జగద్గురు ఆది శంకరాచార్యుల కాలంలోనూ కనిపిస్తాయి. హిందూ సంస్కృతిలో 'ధామ్' అనగా దేవుని నివాసం అని అర్థం. భరతఖండం నలుమూలలా శంకరాచార్యులు స్థాపించిన నాలుగు ప్రధాన ధామ్‌లు (పూరీ, ద్వారక, రామేశ్వరం, బద్రీనాథ్) ఉన్నప్పటికీ, ఉత్తరాఖండ్‌లోని ఈ నాలుగు క్షేత్రాలను 'ఛోటా చార్ ధాం'గా వ్యవహరిస్తారు. శతాబ్దాల క్రితం హిమాలయాల్లోని దుర్గమారణ్యాల మధ్య ఉన్న ఈ ఆలయాలను ఆది శంకరాచార్యుడు పునరుద్ధరించి, భారతీయ సనాతన ధర్మాన్ని ఏకం చేసేందుకు వీటిని ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. నాటి నుండి నేటి వరకు, హిమాలయాలలోని ఈ ప్రాంతాలు మునులు, యోగులు మరియు తపస్వులకు నిలయంగా ఉంటూ, సామాన్య భక్తులకు మోక్షద్వారాలుగా భాసిల్లుతున్నాయి.?యాత్ర క్రమానుగత పద్ధతిని గమనిస్తే, ఇది నైరుతి నుండి ఈశాన్యం వైపునకు సాగుతుంది. సంప్రదాయం ప్రకారం యాత్రికులు తొలుత యమునోత్రిని దర్శిస్తారు. ఇది యమునా నదికి జన్మస్థానం. సూర్యపుత్రిక అయిన యమునా దేవికి అంకితం చేయబడిన ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 3,293 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ స్నానం చేయడం వల్ల యమపాశం నుండి విముక్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం భక్తులు గంగోత్రికి చేరుకుంటారు. ఇది భాగీరథి (గంగా) నదికి మూలస్థానమైన గోముఖానికి సమీపంలో ఉంటుంది. భగీరథుని తపస్సుకు మెచ్చి గంగమ్మ ఇక్కడే భూమికి దిగివచ్చిందని ప్రతీతి. గంగానది పవిత్రత భారతీయ జీవనశైలిలో ఎంతటి విశిష్ట స్థానాన్ని కలిగి ఉందో మనందరికీ విదితమే. ఈ రెండు నదీ మూలాలను దర్శించిన తర్వాత భక్తుల ప్రయాణం అత్యంత కఠినమైన, పవిత్రమైన కేదార్‌నాథ్ వైపు సాగుతుంది.?కేదార్‌నాథ్ ధామ్ శివుని పన్నెండు జ్యోతిర్లింగాలలో అత్యంత ఎత్తులో ఉన్న క్షేత్రం. మహాభారత యుద్ధానంతరం పాండవులు తమ పాప పరిహారం కోసం శివుని వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ఐతిహ్యం. మందాకినీ నది ఒడ్డున కొలువై ఉన్న ఈ క్షేత్రం భక్తికి, పట్టుదలకు పరీక్షగా నిలుస్తుంది. చివరగా భక్తులు బద్రీనాథ్‌కు చేరుకుంటారు. విష్ణుమూర్తి బద్రీనారాయణునిగా కొలువైన ఈ క్షేత్రం వైకుంఠ సమానంగా పరిగణించబడుతుంది. 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా బద్రీనాథ్ వంటి క్షేత్రం ముల్లోకాలలో లేదని పద్మ పురాణం కీర్తించింది. అలకనంద నది తీరాన ఉన్న ఈ ఆలయంలో ధ్యాన ముద్రలో ఉన్న విష్ణువును దర్శించడం ద్వారా యాత్ర పరిపూర్ణమవుతుంది. ఈ నాలుగు క్షేత్రాల సందర్శన అనేది ప్రకృతిలోని పంచభూతాలను, దైవత్వాన్ని ఏకకాలంలో అనుభవించే అవకాశం కల్పిస్తుంది.? గణాంకాల పరంగా చూస్తే, చార్ ధాం యాత్ర యొక్క ప్రజాదరణ ఏటా పెరుగుతూనే ఉంది. శీతాకాలంలో హిమాలయాలు మంచుతో కప్పబడి ఉండటం వల్ల ఏప్రిల్/మే నెలల్లో అక్షయ తృతీయ నాడు ఈ ఆలయాల తలుపులు తెరుచుకుంటాయి మరియు నవంబర్ మొదటి వారంలో దీపావళి తర్వాత మూసివేయబడతాయి. ఉత్తరాఖండ్ పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం, 2022లో సుమారు 46 లక్షల మంది, 2023లో ఏకంగా 50 లక్షలకు పైగా యాత్రికులు ఈ క్షేత్రాలను సందర్శించి రికార్డు సృష్టించారు. 2024 మరియు తదుపరి సంవత్సరాల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. యాత్రికుల సంఖ్య పెరగడం అనేది ఒకవైపు ఆధ్యాత్మిక చైతన్యాన్ని సూచిస్తుండగా, మరోవైపు ఈ సున్నితమైన హిమాలయ పర్యావరణంపై పడుతున్న ఒత్తిడిని కూడా గుర్తుచేస్తోంది. ఈ యాత్ర అనేక సవాళ్లతో కూడుకున్నది. 2013 జూన్ మాసంలో సంభవించిన కేదార్‌నాథ్ వరదలు ఒక తీరని జ్ఞాపకంగా మిగిలిపోయాయి. మేఘ విస్ఫోటనం కారణంగా చొరబడిన వరద నీరు వేలాది మంది ప్రాణాలను బలిగొనడమే కాకుండా, యాత్ర మౌలిక సదుపాయాలను ఛిన్నాభిన్నం చేసింది. ఆ విపత్తు తర్వాత ప్రభుత్వం మేల్కొని యాత్ర భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రస్తుతం 'చార్ ధాం ఆల్ వెదర్ రోడ్ ప్రాజెక్ట్' ద్వారా సుమారు 889 కిలోమీటర్ల పొడవైన రహదారిని అన్ని కాలాల్లో ప్రయాణానికి వీలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా, ప్రమాదాల తీవ్రతను కూడా తగ్గిస్తుంది. దీనితో పాటు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రతి యాత్రికుడికి రియల్ టైమ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు భద్రతను మెరుగుపరిచాయి. ఆర్థికంగా చార్ ధాం యాత్ర ఉత్తరాఖండ్ రాష్ట్రానికి వెన్నెముక వంటిది. ఈ ఆరు నెలల యాత్ర కాలంలోనే రాష్ట్ర జిడిపిలో గణనీయమైన భాగం పర్యాటక రంగం నుండి వస్తుంది. హోటల్ యజమానులు, రవాణా సంస్థలు, గుర్రాల యజమానులు, స్థానిక గైడ్‌లు మరియు చిరు వ్యాపారులకు ఇది ప్రధాన జీవనోపాధి. వేలాది కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు ఈ యాత్ర చుట్టూ తిరుగుతుంటాయి. అయితే, ఈ వాణిజ్యపరమైన ఎదుగుదల ప్రకృతి పర్యావరణానికి ముప్పు కాకూడదనే ఉద్దేశంతో 'పర్యావరణ అనుకూల యాత్ర'పై చర్చలు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణ, చెత్త నిర్వహణ మరియు హిమాలయ గ్లేసియర్ల రక్షణ ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా మారాయి. ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఇప్పుడు యాత్ర స్వరూపం మారుతోంది. గతంలో కాలినడకన నెలల తరబడి సాగే ఈ ప్రయాణం, నేడు హెలికాప్టర్ సర్వీసుల ద్వారా నిమిషాల్లో ముగుస్తోంది. అయినప్పటికీ, భక్తులలో భక్తి భావం ఏమాత్రం తగ్గలేదు. కేదార్‌నాథ్ వెళ్ళే దారిలో 16 కిలోమీటర్ల కఠినమైన కొండ మార్గంలో నడిచే వృద్ధులు, వికలాంగులను చూస్తే భక్తి శక్తి ఏమిటో అర్థమవుతుంది. చలిని తట్టుకుంటూ, ఆక్సిజన్ తక్కువగా ఉండే ఎత్తైన ప్రదేశాలలో వారు ప్రదర్శించే పట్టుదల మానవ మనోబలానికి నిదర్శనం. యాత్రలో ఎదురయ్యే శారీరక కష్టం మనలోని అహంకారాన్ని కరిగించి, వినయాన్ని ప్రసాదిస్తుంది.ముగింపుగా చెప్పాలంటే, చార్ ధాం యాత్ర అనేది కేవలం దర్శనీయ స్థలాల సందర్శన కాదు. అది భారతీయుల సాంస్కృతిక వారసత్వం, భక్తి వైరాగ్యాల సంగమం. హిమాలయాల శిఖరాల నుంచి ప్రవహించే నదులు, చలి గాలుల మధ్య వినిపించే 'ఓం నమః శివాయ' మరియు 'ఓం నమో నారాయణాయ' మంత్రోచ్చారణలు మనిషికి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఆధునికత పెరుగుతున్న కొద్దీ యాత్ర సౌకర్యవంతంగా మారవచ్చు కానీ, ఆ హిమాలయాల పవిత్రత, భక్తుల ఆర్తి ఎప్పటికీ అలాగే ఉంటాయి. భవిష్యత్ తరాలకు ఈ ఆధ్యాత్మిక సంపదను అందించడం కోసం పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ఈ పవిత్ర యజ్ఞాన్ని కొనసాగించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. చార్ ధాం యాత్ర అంటే మనిషి తనను తాను తెలుసుకోవడం మరియు పరమాత్మలో లీనమవ్వడం కోసం చేసే ఒక మహోత్కృష్ట ప్రయత్నం. ఈ ప్రయాణం ముగిసే సమయానికి ప్రతి యాత్రికుడు తనతో పాటు కేవలం జ్ఞాపకాలను మాత్రమే కాదు, ఒక కొత్త దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇంటికి తీసుకువెళతాడు.

# అద్వైత మత స్థాపకులు ఆదిశంకరులు

" శంకారూపేణ మచ్చిత్తం పంకీకృతమభూద్యయా, కింకరీ యస్య సా మాయా శంకరాచార్యమాశ్రయే"...
"సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం, అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరాం" వేదాలలో ఉపనిషత్తులలో, భగవద్గీతలో ఉన్నదే అయినప్పటికీ, ప్రజలు మరిచిపోయిన అంశాలను తిరిగి ఉటంకిస్తూ, బౌద్ధ మతంలోని మంచి సిద్ధాంతాలను చేర్చి, అద్వైత మత స్థాపన ఆచార్యుడైనాడు ఆదిశంకరుడు. తూర్పున పూరీ జగన్నాథంలో గోవర్ధన మఠం, పశ్చిమాన ద్వారకలో కాళికా (శారదా)మఠం, ఉత్తరాన బదరీ కేదారంలో జ్యోతిర్మఠం, దక్షిణ దిశలో శృంగేరి యందు శృంగగిరి శారదా మఠం స్థాపించి, మత కార్యనిర్వాహణ కోసం, దేశం నలు చెరుగులా సంచరించి, అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొనసాగించారాయన. సమకాలీన హైందవ మతంపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త ఆయన. హిందూ మతాన్ని ఉద్ధరించిన త్రిమతా చార్యులలో ప్రథములు ఆది శంకరులు. క్రీస్తుశకం 788 - 820 మధ్య శంకరులు జీవించి ఉంటారని ఒక భావన. "దుష్టాచార వినాశాయ ప్రాదుర్భూతో మహీతలే, న ఏవ శంకరాచార్య సాక్షాత్ కైవల్య నాయక:" దుష్టాచారాలను, నశింప చేసేందుకై, కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివ న్యాసం" స్పష్ట పరుస్తున్నది. "కరిష్యత్సవతా రం స్వం శంకరో నీల లోహిత: శ్రౌత, స్మార్త ప్రతిష్ట అర్థం భక్తానాం హిత కామ్యాయా". శ్రౌత స్మార్త ప్రతిశ్టార్థం భక్తానాం హిత కామ్యాయా. శ్రౌత స్మార్త క్రియలను సుప్రతిష్టితం చేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి, త్రినేత్రుడు స్వయంగా శంకరుల రూపంలో అవతరించారని కూర్మపురాణం విశదీకరిస్తుంది. త్రిచూర్ లోని వృషాచల పర్వతం పై గల శివున్ని ప్రార్థించి ఆయన అనుగ్రహం పొందిన, కృష్ణ యజుర్వేద శాఖకు చెందిన, నంబూద్రి బ్రాహ్మణ దంపతులైన ఆర్యాంబ, శివగురువులకు, కేరళలోని పూర్ణ నది తీరాన గల కాలడిలో, ఉత్తరాయణ పుణ్య కాలమున వైశాఖ శుక్ల పంచమి నాడు, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రలో, సూర్యుడు శని, గురుడు, కుజుడు ఉచ్చ స్థితిలో ఉండగా శంకరులు జన్మించారు. మూడవ యేటనే తండ్రిని కోల్పోయిన శంకరులకు ఐదవ యేట ఉపనయన సంస్కారము జరిగింది. బ్రహ్మచర్య దీక్షలో భాగంగా మాధుకరం కోసం భిక్షాటనకు వెళ్లిన శంకరులకు ఒక పేద బ్రాహ్మణుని యింటి యిల్లాలు వద్ద ఉసిరికాయ తప్ప ఏమీ దొరకలేదట. ఆమె దుస్థితికి కరిగిన శంకరులు లక్ష్మీదేవిని కనకధారా స్తోత్ర రూపంలో ప్రార్థించగా ఆ తల్లి కరుణించి ఆ ఇంట బంగారు ఉసిరికలు కురిపించి వారి దారిద్ర్యాన్ని పోగొట్టిందట. సన్యాసం తీసుకోవడానికి తల్లిని అనుమతి కోరగా, ఆమె నిరాకరించగా ఒక నాడు, పూర్ణా నదిలో స్నానమాచరించే సమయాన, మొసలి పట్టుకోగా, మరణించే లోగా నైనా సన్యాసిగా ఉంటానని, తల్లిని కోరగా, ఆమె అంగీకారంతో సన్యాసిగా మారే మంత్రం పఠిస్తూ ఉండగా, మొసలి శంకరులను వదిలేసింది. వ్యాస కుమారుడైన, శుకుని శిష్యులైన, గౌడపాదుల శిష్యుడైన, గోవింద భగవత్పాదుల నర్మదా తీర గుహ దర్శనం లభించింది.తల్లి అనుమతితో సన్యాసం స్వీకరించి శంకరులు భారత దేశ యాత్ర మొదలు పెట్టారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నర్మదా నదిని తన కమండలములో బంధించిన శంకరుని చూసి ముగ్ధులైన గురు గోవింద భగవత్పాదులు శంకరులను తన శిష్యునిగా స్వీకరిస్తారు.గోవింద పాదులు జ్ఞాన సమాధి నుండి చూసి, సాక్షాత్తూ భువికి దిగివచ్చిన పరమ శివుడే శంకరుడు అని అన్నారు. శంకరులు మొదటి సారిగా, గోవింద భగవత్పాదులకు పాదపూజ చేయగా, నేటికీ ఆ పరంపర కొనసాగుతూనే ఉంది. గురుసేవ తోనే జ్ఞానార్జన సాధ్యమని, ప్రపంచానికి ఆయన చాటారు. వారణాసిలో సదానందుడు శంకరుని మొదటి శిష్యులయ్యారు. గంగా నది వైపు వెళుతున్న సమయంలో, నాలుగు శునకాలతో, చండాలుడు అడ్డు రాగా, చండాలుని మాటలు విన్న శంకరుడు... పరమశివుడే చతుర్ వేదాలతో వచ్చాడని గ్రహించి, మనీషా పంచక స్తోత్రం చేసి, బ్రహ్మ సూత్రాలకు బాష్య సూత్రాలు రాసి, సిద్ధాంతం వ్యాప్తికి, సంరక్షణకు దేశవ్యాప్తంగా శిష్యులను పంపాలని, శివుని ఆదేశం పొంది, కర్తవ్య ముఖులైనారు శంకరులు. ఎనిమిది రోజుల చర్చ అనంతరం, వ్యాస భగవానుని సంతృప్తిపరచి, ఆయుర్ధాధిక వరం పొందారు. శంక రులు సన్యాసం తీసుకున్నాక, కొత్త పేరును సూచించే యోగ పట్టం... తీర్థ, ఆశ్రమ, వన, గిరి, అరణ్య, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి అనే పది పేర్లను, శంకరుడు మఠం నిర్వాహకులకు నిర్ణయించారు. సాంఖ్య, బౌద్ధ, జైన, వైశేషిక వాదాలను, వేదాంత విరుద్ధ హిందూ భావజాలాన్ని ఖండించి, ఉపనిషత్తుల ఆధారంగా, అద్వైత మతాన్ని నిరూపణ చేసేందుకు స్వానుభవాన్ని జోడించి, తర్కానికి ప్రముఖ స్థానం కల్పించి, భాష్యాలు, ప్రకరణ గ్రంధాలు, స్తోత్రాలు రచించారు. ఆత్మ , బ్రహ్మం (పరమాత్మ) ఒకటే అనేది అద్వైత మూలసూత్రం. ఇందుకు మౌలిక సూత్రాలను, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మ సూత్రాలు, ప్రస్థాన త్రయం నుండి ఆయన గ్రహించారు. క్షీణ దశలో ఉన్న హిందూ మతాన్ని పునరుద్ధరించి, వివిధ శాఖల పండితులను ఓడించి, తన సిద్ధాంతాన్ని ఒప్పించి, భగవంతుని నమ్మే వారందరినీ ఏకీ కృతుల చేసి వేదాలలో విశ్వాసాన్ని, హిందువులలో ఆత్మ విశ్వాసాన్ని పెంచారు. బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్యాసం స్వీకరించారు. సన్యాసి అయి ఉండి, తల్లికి అంత్యక్రియలు నిర్వహించి, డెబ్బై రెండు మతాల వారిని జయించి, సూత్ర భాష్య శతాధిక ఉద్గ్రంతాలు రచించి, బ్రహ్మసూత్రాల భాష్య కారుడై, కైలాస నాథుని అనుగ్రహం వల్ల జన్మించి, "సుఖం కలిగించు వాడు" అనే అర్థముతో "శంకర" నామాంకితులై, 32 ఏళ్ళకే, కైలాస గమనం చేసిన శంకరునికి ప్రత్యేకతలున్నాయి. నువ్వు వేరు... నేను వేరు' అనే సంకుచిత మార్గం నుండి 'అందరమూ ఒకటే' అన్న విశాల మార్గంలోకి రప్పించిన వేదాంతి. 'జీవుడే బ్రహ్మం... బ్రహ్మమే జీవుడు. ఆ ఇద్దరికీ తేడాలేదు. చుట్టూ కనిపించేదంతా మాయ మాత్రమే. అజ్ఞానం లోనుండి బయటపడి తనను తాను తెలుసుకో గలగాలి' అని ఆది శంకరుడు ఉద్బోదించారు.ఆయన చేసిన స్తోత్రాల్లో మనీషా పంచకము, సాధన పంచకము, భజ గోవిందము, గోవిందాష్టకము, పాండు రంగాష్టకము, శివ సువర్ణ మాలా స్తోత్రము, అర్ధనారీశ్వర స్తోత్రము, కాలభైర వాష్టకము, దక్షిణామూర్తి స్తోత్రము, నిర్వాణ షట్కము, అన్నపూర్ణాష్టకము, అచ్యుతాష్టకము, మహిషాసుర మర్దిని స్తోత్రము, త్రిపురసుందరీ స్తోత్రము, భుజంగాష్టకాలు, భవాన్యష్టకము, దేవీ నవరత్న మాలికా, విశ్వనాథా ష్టకము, ఉమామహేశ్వర స్తోత్రము, సౌందర్య లహరి, శివానంద లహరి, వివేక చూడామణి మొదలైనవి.

# చెట్ల నీడే చిన్నపిల్లలకు శ్రీరామరక్ష..

## పచ్చని చిగురులు ప్రకృతికి వెలుగులు..

## పూల అందాలతో మరింత అలంకారం..





**కొల్చారం,ఏప్రిల్20(సూర్యరేఖ)** వేసవి ప్రారంభంతోనే ప్రకృతి మళ్లీ పచ్చని వర్ణాలతో కళకళలాడుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో చెట్లు కొత్తగా చిగురించడం ప్రారంభించడంతో పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి.ఎండ తీవ్రత పెరుగుతున్న ఈ కాలంలో చెట్లపై వెలసిన పసిడి-పచ్చని ఆకులు ప్రకృతికి ప్రత్యేక ఆకర్షణను తీసుకొస్తున్నాయి. ఉదయం,సాయంత్రం వేళల్లో ప్రజలు బయటకు వచ్చి ఈసహజ సోయగాలను ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా రోడ్ల వెంట చిగురించిన చెట్లు పర్యావరణానికి శోభను చేకూరుస్తున్నాయి.పక్షుల కిలకిలారావాలు,తేలికపాటి గాలులు కలిసిన ఈ దృశ్యం మరింత మనోహరంగా మారుతోంది.ఇదిలా ఉండగా,రంగురంగుల పూలతో రోడ్లకు ఇరువైపులా పువ్వుల అందాలు విరబూస్తూ ప్రయాణికుల కనులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి.పూల సువాసనలు,పచ్చని చెట్ల మధ్య కలిసిన ఈ వాతావరణం ప్రకృతిని మరింత సుందరంగా మార్చుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా చిగురించిన చెట్లు పల్లె అందాన్ని మరింత పెంచుతున్నాయి.ఈ పచ్చదనం ప్రయాణికులకు చల్లని అనుభూతిని కలిగిస్తూ సహజ వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది.ప్రకృతి అందాలనుకాపాడుకోవాలంటే చెట్ల సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. వేసవిలో చెట్లకు తగినంత నీరు అందించడం,కొత్త మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని మరింత విస్తరించవచ్చని వారు పేర్కొన్నారు.

## ఘనంగా బెల్లంపల్లి టిఎన్టియుసి కార్యాలయంలో

# చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు..





**బెల్లంపల్లి,ఏప్రిల్20(సూర్యరేఖ)** బెల్లంపల్లి తెలుగు దేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్టీయూసీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...సమైక్య ఆంధ్రప్రదేశ్ కాలంలో హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా అభివృద్ధి చేసి లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన నాయకుడు చంద్రబాబునాయుడు అని పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో భాగంగా రింగ్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించి హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాడని తెలిపారు .బడుగు,బలహీన వర్గాల అభ్యున్నత కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన నాయకుడిగా గుర్తింపు పొందినట్టు చెప్పారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం భవిష్యత్తును ముందుగానే గుర్తించి ఆదిశగా చర్యలు తీసుకోవడం వల్లే నేడు హైదరాబాద్ ప్రపంచ స్థాయి హైటెక్ హబ్‌గా నిలిచిందని పేర్కొన్నారు.అలాగే సింగరేణి సంస్థను బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లకుండా కాపాడేందుకు రూ.1263కోట్లు సమీకరించి సంస్థను నిలబెట్టినట్లు తెలిపారు.నిరుద్యోగులకు ఎలాంటి లంచం లేకుండా సుమారు 40,000మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాడని పేర్కొన్నారు .సింగరేణి లాభాల్లో10 శాతం కార్మికులకు ఇవ్వడం ద్వారా కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టి. మణిరామ్ సింగ్ (పట్టణ అధ్యక్షుడు),గద్దెల నారాయణ,బొల్లు మల్లయ్య, గజ్జె దుర్గయ్య, అలువాల కుమార్,ఎస్.కె.అస్గర్ బాషా,మోసాడి గోపాల్,బి. సత్యనారాయణ, ఆర్. గంగాధర్ గౌడ్, బి. కుమార్,ఎం. రాజయ్య, పుల్లూరి పోశం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడి వద్దు,ప్రభుత్వ పాఠశాల ముద్దు..

చెన్నూరులో ముందస్తు బడిబాట..





**ఖమ్మం,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** కల్లూరు మండలం చెన్నూరు గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమం సోమవారం జరిగింది జడ్పీహెచ్ఎస్ చెన్నూర్ ప్రాథమిక పాఠశాల చెన్నూరు విద్యార్థులు బడిబాట బ్యానర్ ప్లేకార్డ్స్ తో గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి అని కోరారు.చెన్నూరు కాంప్లెక్స్ హెచ్ఎం ఝాన్సీ రాణి మాట్లాడుతూ...అన్ని వసతులు, అనుభవజ్ఞులు అత్యధిక విద్యార్హత,అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించవలసిందిగా సూచించారు.సీనియర్ ఉపాధ్యాయులు పొట్రు మధు మాట్లాడుతూ...గత ఏడాది10వ తరగతిలో అత్యున్నత ఫలితాలు సాధించామని,కాబట్టి ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలందరిను చేర్పించవలసిందిగా కోరారు.ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎం.రమాదేవి మాట్లాడుతూ...ఈసిఆర్ ద్వారా పిల్లల్లో ఇంగ్లీష్ నైపుణ్యత పెరిగిందని, రాబోయే విద్యా సంవత్సరంలో మీ పిల్లలందరినీ మా బడిలోనే చేర్పించండి అని కోరారు. బడిబాట కల్లూరు మండల స్వచ్ఛంద ప్రచారకర్త దంతాల సుధాకర్ మాట్లాడుతూ...ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని, ఆటపాటలతో కూడిన గుణాత్మక విద్య,ప్రభుత్వ పాఠశాలలోని లభిస్తుందని,రాబోయే విద్యా సంవత్సరంలో,గుడ్డు,రాగిజావతో పాటు 5రకాల అల్పాహారం స్పెషల్ కిట్టు ద్వారా 21రకాల వస్తువులు ఫ్రీగా అందిస్తారని, కాబట్టి పిల్లలందరినీ మీ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే చేర్పించమని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్. ఎస్ ,చెన్నూరు సిఆర్పి,లక్ష్మి తాయారు,ఉపాధ్యాయులు మేకల శ్రీనివాసరావు నేతాజీ రహీమున్నీసా,తదితరులు పాల్గొన్నారు.

## ఏడిఆర్ఎం ఆసుపత్రి- బొడ్రాయి వరకు గల రోడ్డులో మ్యానువల్స్ ఎత్తు పెంచాలి..

జలమండలి జి.ఎం.కు కాంగ్రెస్ నేతల వినతి





**ఉప్పల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్ లోని ఏడిఆర్ఎం ఆసుపత్రి నుండి ఓల్డ్ రామంతపూర్ బొడ్రాయి వరకు రోడ్డు పూర్తిగా పాడైన నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి చొరవతో ప్రభుత్వం నుండి నిధులు తెచ్చుకొని,కొత్త రోడ్డు నిర్మాణాన్ని ఇటీవలే పూర్తి చేయటం జరిగింది. అయితే,ఈ రోడ్డు నిర్మాణ సమయంలో మధ్యలో ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్స్ ఎత్తు పెంచకపోవటంతో కొత్త రోడ్డు నిర్మాణం తర్వాత మ్యాన్ హోల్స్ ఉన్న చోట గుంతలుగా మారిపోయాయి.దీని వల్ల వాహనదారులకు అనేక ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నందున విషయాన్ని జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్ ను రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి సమస్యను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే మ్యాన్ హోల్స్ ఎత్తును పెంచాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు.వీలైనంత తొందరలో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ జలీల్ పాషా ,ముత్యాల జంగయ్య,శామ్యూల్,సందీప్,శగా శ్రీధర్,జంగయ్య, భాస్కర్, బుల్లెట్ అశోక్,సతీష్ గౌడ్, శోభ,కే.శంకర్, రాజకుమార్, రమాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## బోర గంగయ్య కుటుంబానికి కుడితి మహేందర్ రెడ్డి పరామర్శ..

ఆర్థిక సహాయం అందజేత..

అండగా ఉంటామని భరోసా..





**మరిపెడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోర గంగయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా,ఇట్టి విషయం తెలుసుకున్న ఒడిసిఎంఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కుడితి మహేందర్ రెడ్డి సోమవారం గంగయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ముందుగా గంగయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని ఆభగవంతున్ని ప్రార్థించారు.గంగయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.గంగయ్యతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.గంగయ్య కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అనంతరం కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు.

# ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ ముందు ధర్నా..






**మంచిర్యాల,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి,విధుల్లోకి తిరిగి తీసుకోవాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు.అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల సమస్యల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న సుమారు 220 కుటుంబాల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు.రాబోయే రోజుల్లో మరిన్ని ప్రతికూల పరిణామాలు చోటుచేసుకునే అవకాశంపై కార్మికుల్లో అనుమానాలు,ఆందోళనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించి,కార్మికులను పాత విధానంలోనే విధుల్లోకి తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు పక్షాన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దీనికి సింగరేణి అధికారులు,అలాగే చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే,కార్మికశాఖ మంత్రి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# హబ్సిగూడ స్ట్రీట్ నంబర్-8లో చలివేంద్రాన్ని ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి





ఇంద్రఆర్కేడ్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..

**ఉప్పల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్-8లో ఇంద్రఆర్కేడ్ అపార్ట్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇంద్ర ఆర్కేడ్ అపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందయమని పరమేశ్వర్ రెడ్డి అన్నారు.ముఖ్యంగా స్ట్రీట్ నెంబర్-8లో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమని పేర్కొన్నారు.హబ్సిగూడ;ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల దప్పిక తీర్చేందుకు వేసవికాలంలో చలివేంద్రాల ఏర్పాటు ఆవశ్యకత ఎంతో అవసరం అని పేర్కొన్నారు.పార్టీ నాయకులు అవసరమైన చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంద్రఆర్కేడ్ అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షురాలు వాసవి,సెక్రటరీ మమత,ట్రెజరర్ శిల్పా,కమిటీ మెంబర్స్ పద్మజ,ఫ్రాంక్లిన్,సందీప్,సుమతి,ఎం.జగన్ మోహన్ రెడ్డి,జయశ్రీ,వాణి, హరిహర వర్మ, ఆంజనేయులు,సీమ,మల్లారెడ్డి,దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిసిసి వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి,మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి,జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్,మురళి ముదిరాజ్,రాజు నాయక్,గుండు రాజు,కిషన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో క్రైస్తవ సమాధుల సమస్య పరిష్కరించండి..

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన క్రైస్తవ నాయకులు,పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు





**హైదరాబాద్,ఏప్రిల్20(సూర్యరేఖ):** ఫ్యూచర్ సిటీలో క్రైస్తవ సమాధుల సమస్యను పరిష్కరించి కమిటీని ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ప్రజావాణిలో క్రైస్తవ నాయకులు ఫాస్టరీ ఫెలోషిప్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు.సందర్భంగా వారు మాట్లాడుతూ...గత ప్రభుత్వం కేటాయించిన సమాధుల స్థలాలను రంగారెడ్డి జిల్లా 13ఎకరాలను వినియోగంలోకి తీసుకురావడంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందింది.అజయ్, నారాయణరెడ్డి,లు కలెక్టర్లు సుముఖంగా ఉన్నపటికీ ఆర్డిఓల అలసత్వం, తహసీల్దార్ల నిర్లక్ష్యం వలన బాలాపూర్, ఇబ్రాహీంపట్నం ,మహేశ్వరం మండలం దళిత క్రైస్తవులు దుర్బర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు .ఇబ్రహీంపట్నం,ఖల్సా గ్రామ పరిధిలో సమాధుల ఐదు ఎకరాల్లో మూడు ఎకరాలు కబ్జాకు గురైంది.కేవలం రెండు ఎకరాలు మాత్రమే మిగిలింది.అందులోకి వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు.గంగారం మహేశ్వర మండలంలో మార్కింగ్ చేసి భూమి చదును చేసి సమాధులకు వినియోగానికి,ప్రభుత్వం ఎంపిక చేసిన సమాధుల కమిటీ వారికి అప్పగించాలి.చౌలపల్లి ఫరూఖ్ నగర్,కొడిచర్ల కొత్తూరు మండలం స్థల గుర్తింపు బౌండరీ భూమి చదివి చేసే కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించలేదు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను దేశంలోని ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన నిర్వహిస్తుండగా,తన కలలు కన్న రంగారెడ్డి జిల్లాలోని ఫీచర్ సిటీ ప్రాంతంలో క్రైస్తవులకు దళిత క్రైస్తవులకు సమాధుల స్థలాలకు సౌకర్యం లేక రాబోయే రోజుల్లో కార్పొరేట్ విదేశీ బిజినెస్ కంపెనీలు వస్తే వాటిల్లో ఉండే క్రైస్తవ ఉద్యోగులకు క్రైస్తవ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు తలెత్తుతాయి. స్థానిక పాస్టర్లు, దళిత క్రైస్తవులకు తీవ్ర ఇబ్బందుల్ని అనుభవిస్తున్నారు.కావున ఇకనైనా వెంటనే 13 ఎకరాలతో పాటుగా మంఖాల్ ఉన్న సమాధుల స్థలానికి కమిటీని,బడ్జెట్ కేటాయించి క్రైస్తవులకు వినియోగానికి అందచేయాలని పలువురు క్రైస్తవ నాయకులు, పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిదులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.వారంలోపు సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బలపడు కాస్టర్పల్లి షిప్ జోసఫ్ ఇమ్మానియేల్ ఇబ్రహీంపట్నం బరియల్ గ్రౌండ్ కమిటీ చైర్మన్ చెరుకూరి రాజు,తదితరులు కలెక్టర్ కలిసిన వారిలో ఉన్నారు.యునైటెడ్ క్రిస్టియన్ చర్చి అసోసియేషన్ అధ్యక్షులు బాలాపూర్ కమిటీ రెవ. జె.జోసెఫ్ ఇమ్మాన్యుయేల్,రెవ.పి.జయ రాజు,రెవ.డి.జాషువా, రెవ.బి.లాజర్ నాయక్ , బాల సింగ్ నాయక్,రెవ.బి.ఎలిషా,బ్రో.ఎం.ప్రభాకర్, ఇబ్రాహిట్నం బరియల్ గ్రౌండ్ కమిటీ చైర్మన్ చెరుకూరి రాజు,విక్టర్ సన్మత్,కరుణాకర్, కృష్ణపాల్,సుందర్, సామ్యేల్, రోషన్ దౌల బాప్టిస్ట్ చర్చి మత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్





**మరిపెడ,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనేపురం స్టేజికి చెందిన గుగులోత్ పుల్ సింగ్ మృతి చెందగా,ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.తొలుత పుల్ సింగ్ భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుమారుడు గాంధీ,పుల్ సింగ్ సోదరుడి కుమారుడు సుమన్ లను ఓదార్చారు.మాజీ ఎమ్మెల్యే రెడ్యా వెంట గుగులోత్ లాల్ సింగ్,ఉగ్గంపల్లి సర్పంచ్ అయూబ్ పాషా,మాజీ సర్పంచ్ జాటోత్ భీమా నాయక్,గుగులోత్ రెడ్డి,మురళి,మంగ్యా,సుక్ల,మాలోత్ హోలీ తదితరులు ఉన్నారు

## హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా గణేష్ మొధుగు నియామకం..



**ఉప్పల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు మేడ్చల్ -మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ ఎక్స్యూటివ్ మెంబెర్స్ గా గణేష్ మొధుగును సంస్థ చైర్మన్ మాధవ్ నియమించారు. మేడ్చల్-మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గా నియమితులైన గణేష్ మొధుగు మాట్లాడుతూ... నా మీద నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన చైర్మన్ మాధవ్,మా నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండ,లకు కృతజ్ఞతలు తెలియజేశారు.మానవ హక్కుల పరిరక్షణ కోసం నా శక్తి మేరకు పనిచేస్తానని వెల్లడించారు.బాధితులకు అండగా నిలిచి,న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు."సంస్థ అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.హక్కులు భంగమవుతున్న ప్రతిసారి హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున గట్టిగా స్పందించి బాధితులకు న్యాయం చేస్తానని అన్నారు.నా నియామకం బాధ్యతను మరింత పెంచినట్లుందని వారు అన్నారు.ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు,స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన మేడ్చల్-మల్కాజ్గిరి డిస్టిక్ ఎగ్జిక్యూటివ్ ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిర్దిష్ట కాల వ్యవధిలో జనాభా లెక్కలను పూర్తి చేయాలి..

శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ



**జల్ పల్లి,ఏప్రిల్20(సూర్యరేఖ)** జల్ పల్లి సర్కిల్ పరిధిలో జనాభా లెక్కలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ అధికారులకు సూచించారు.ఈ మేరకు సోమవారం జల్ పల్లి సర్కిల్ పరిధిలో ప్రిన్సెస్ ఈఎస్ఐఎన్ హైస్కూల్ లో జరుగుతున్న జనగణన శిక్షణ కేంద్రాన్ని ఆమె అకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా మే11నుండి జూన్ 9వరకు నిర్వహించబడే జనాభా లెక్కలను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు.మొదటి విడతలో ఇంటింటి వివరాల సేకరణలో భాగంగా ప్రతి ఎన్యుమరేటర్ 200నుండి 250ఇళ్లకు సంబంధించిన సమాచారం సేకరించాలని, సుమారు 800మంది జనాభా వివరాలను నమోదు చేయాలన్నారు.సెన్సెస్ 2027 జనాభా లెక్కల శిక్షణ కార్యక్రమానికి కేటాయించబడిన ఉద్యోగులందరూ విధిగా హాజరుకావాలని,లేనిపక్షంలో సెన్సెస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ చంద్రకళ తెలిపారు.ఈ కార్యక్రమంలో జల్పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.వెంకట్రామ్అసిస్టెంట్ కమిషనర్ వినయ్ కుమార్,ఫీల్డ్ ట్రైనర్ ఆయేషా, జ్యోతి,స్వప్న,వినీత్,సుధాకర్,ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

## రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి..

### కాంగ్రెస్ జిల్లా యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి

### పురుషోత్తమాయగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

**మరిపెడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని కాంగ్రెస్ జిల్లా యువ నాయకులు నూకల అభినవ్ రెడ్డి అన్నారు.సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అభినవ్ రెడ్డి మాట్లాడుతూ...ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు.రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు.దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.ధాన్యాన్ని తూర్పారబట్టి, తాలు,చెత్త,మట్టి గడ్డలు లేకుండా,17శాతం తేమ ఉండేలా చూసుకొని నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభిస్తుందని తెలిపారు.ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,389,కామన్ వెరైటీకి రూ.2,369మద్దతు ధర అందుతుందని తెలిపారు.రైతులు ధాన్యం



కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పటేల్ దుర్గయ్య,పిఏసిఎస్ సీఈఓ బొల్లెపల్లి నరేష్,నాయకులు,రైతులు,పిఏసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అపార్టమెంట్ లో అగ్నిప్రమాదం,15 బైక్లు దగ్ధం..



**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** గచ్చిబౌలి పరిధి టీఎన్జీవోకాలనీలో ఉన్న ఓ అపార్ట్మెంట్ లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.సెల్లార్ లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.మంటలతో పాటు దట్టమైన పొగ భవనం అంతటా వ్యాపించడంతో నివాసితులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పై అంతస్తుల్లో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రక్షించారు.ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనలో సెల్లార్ లో నిలిపి ఉంచిన సుమారు15 బైక్ లు కాలి బూడిదయ్యాయి.పోలీస్ లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి..

**మరిపెడ ఎంపీడీఓ బి.వేణుగోపాల్ రెడ్డి**

**మరిపెడ మినీ గురుకుల పాఠశాలలో ఘనంగా వెల్ఫేర్ వీక్ కార్యక్రమం..**





**మరిపెడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మరిపెడ ఎంపీడీఓ బి.వేణుగోపాల్ రెడ్డి అన్నారు.సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని ఆర్లగడ్డ స్టేజి వద్దగల మినీ గురుకుల పాఠశాలలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మినీ గురుకులం వెల్ఫేర్ వీక్ కార్యక్రమం హెడ్ మాస్టర్ పి.మైథిలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ బి.వేణు గోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగం చేసి,చదువులపై పూర్తి దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు.చదువు ప్రతి ఒక్క విద్యార్థికి ఎంత అవసరమని,లక్ష్యంతో చదువుకొని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు.ప్రభుత్వం తరఫున అందిస్తున్న పథకాలు, సౌకర్యాల గురించి కూడా వివరించారు.పాఠశాల పరిపాలన తరఫున విద్యా,పరిపాలనా అంశాలను తల్లిదండ్రులు,గ్రామస్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో ఘనంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు


**మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ**

**తెలుగు యువత అధ్యక్షులు బజారు హేమంత్ కుమార్ గౌడ్**



**ఉప్పల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు, బజారు హేమంత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు సోమవారం ఉప్పల్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప్పల్ చౌరస్తాలో కేక్ కట్ చేసి,సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా,పరిసర ప్రాంతాల్లో దాదాపు 2000మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న తిరునగరి,టిడిపి సీనియర్ నాయకులు టీజీకే మూర్తి,పబ్బతి శేఖర్ రెడ్డి,అంతగళ్ళ అశోక్, కృష్ణారెడ్డి,డాక్టర్ రాంబాబు, ఓబయ్య ,సాయి నాగార్జున,శివ కెపి,ఇంతియాజ్,విష్ణుగౌడ్, అంకమ్మరావు, ముఖేష్,శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువు మరో మూడు రోజులు పొడిగింపు..




**హైదరాబాద్,ఏప్రిల్20(సూర్యరేఖ)** తెలంగాణలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు, ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 23వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఇంటర్ ప్రథమ,ద్వితీయ పరీక్షల ఫలితాలు ఈనెల 12న విడుదలయ్యాయి.కాగా ఈ పరీక్షలో ఉత్తీర్ణులై మార్కులు ఎక్కువ సాధించాలని భావించే విద్యార్థులు,ఫెయిలైన విద్యారులకు మే13నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.మే22 నుంచి25 వరకు ప్రాక్టికల్స్,మే26న ఫస్టియర్, సెకండియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్,28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష,ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

## మండల సమైక్య వివోఏలకు అవగాహన కార్యక్రమం..



**నిజాంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని మండల మహిళ సమైక్య భవనములో సోమవారం మండలంలోని వివోఏలకు స్పేర్ యాక్టివేట్స్ రివ్యూ మీటింగ్ ను ఏపీఎం అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిఆర్డిఓసరస్వతి,డిపిఎం బాలరాజు,హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బ్యాంకులో రుణం తీసుకున్న మహిళలు సక్రమంగా కట్టుకోవాలన్నారు. అలాగే ఉద్యమ్ ఆధార్ పైన వివోఏలకు అవగాహన కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో సీసీ రవీందర్,వెంకట్రాజ్యం, అమృత ,అకౌంటెంట్ స్వామి, వివోఏలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం..





**నిజాంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** మండల పరిధిలోని జెడ్ చెరువు తాండ గ్రామంలో గ్రామానికి చెందిన మాలోత్ రజిత నవీన్,లనూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాఎంపీడీవో రాజిరెడ్డి హాజరై నూతన గృహప్రవేశం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేదలకు 5లక్షల రూపాయల వ్యయంతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి నిరుపేదల కల నెరవేర్చిందన్నారు. గృహప్రవేశం చేపట్టిన రజిత కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాబునాయక్,ఉపసర్పంచ్ రతన్ సింగ్, కార్యదర్శి నాగలక్ష్మి,వార్డు సభ్యులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నాచారం ప్రధాన రహదారిలో సిగ్నల్ ఏర్పాటు చేయండి..దారి వదలండి

**జోనల్ కమిషనర్,కు సాయిజెన్ శేఖర్ వినతి**




**ఉప్పల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** నాచారం ప్రధాన రహదారి రాఘవేంద్రనగర్ కి వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని,దారి వదలాలని కోరుతూ సోమవారం రాష్ట్ర విఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా,ను ఉప్పల్ లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జోనల్ కమిషనర్ కు సమస్యను వివరించారు.నాచారం ప్రధాన రహదారి లో ఇదివరకు రాఘవేంద్రనగర్ కు వెళ్లే వారికి అలాగే కార్తికేయనగర్ వెళ్లే వారికి రోడ్డు మధ్యలో ఒక ఓపెనింగ్ ఉండేదని,కొన్ని కారణాల వల్ల ఈ ఓపెనింగ్ ను మూసి వేయడం జరిగింది.దారి మూసివేసిన తరువాత రాఘవేంద్రనగర్ వెళ్లే వారికి ఈఎస్ఐ హాస్పిటల్ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవలసి వస్తున్నది.నాచారం మహంకాళి ఆలయం ముందు ఒక ఓపెనింగ్ ఉన్నదని,ఇక్కడి నుండి ఈఎస్ఐ హాస్పిటల్ వరకు వెళ్లి యూటర్న్ చేసుకొని రావాలంటే సుమారు ఒకటిన్నర కిలోమీటర్ వెళ్లి రావలసి వస్తున్నది.అందువల్ల చాలా వరకు మహంకాళి గుడి నుండి రాంగ్ రూట్ లో రాఘవేంద్రనగర్ కు వెళు న్నారు.వెళ్లే సమయంలో చాలా ఇదివరకు యాక్సిడెంట్లు కూడా అయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు కూడా రాస్తున్నారని అయినా కానీ ఎవరు ఈఎస్ఐ వరకు వెళ్లి యూటర్న్ తీసుకోవడం లేదు .రాఘవేంద్రనగర్ ఒకటే కాలనీ కాకుండా శ్రీరాఘవేంద్రనగర్, న్యూరాఘవేంద్రనగర్, ఇందిరానగర్,శాంతిగార్డెన్స్,అన్నపూర్ణకాలనీ,సాయి నగర్ కాలనీ వారు అందరు కూడా చాలా వరకు ఒకటిన్నర కిలోమీటర్ దూరం వెళ్లలేక రాంగ్ రూట్లో వస్తున్నారు.ఇదే విషయమై ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారని సమస్యను పరిష్కరించాలని కోరారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# ఆపరేషన్ సేఫ్ స్కూల్ రూ.1.10కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తుల సీజ్,విద్యాసంస్థల వద్ద విక్రయాలపై 567కేసులు..

పొగాకు ఉత్పత్తులే డ్రగ్స్ కు తొలిమెట్టు,విద్యార్థులు, యువత భవిష్యత్తుతో
చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు...నగర సీపీ వీసీ సజ్జనర్.








**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్20(సూర్యరేఖ)** విద్యార్థులు,యువతను డ్రగ్స్ ఊబిలోకి నెడుతున్న విద్యాసంస్థల సమీపంలోని పొగాకు ఉత్పత్తుల విక్రయ దుకాణాలపై హైదరాబాద్ సిటీ పోలీసులు ఉక్కుపాదం మోపారు.విద్యాసంస్థల పరిసరాలను మాదకద్రవ్యాల రహితంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ సేఫ్ స్కూల్' లో భాగంగా ఈ నెల విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలపై 567కేసులను నమోదు చేసి,సుమారు రూ.1.10 కోట్ల విలువైన నిషేధిత గుట్కా,సిగరెట్లు,ఇతర పొగాకు ఉత్పత్తులను సీజ్ చేశారు.హైదరాబాద్ కమిషనరేట్ వ్యాప్తంగా సాగిన సోదాల్లో జోన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే అత్యధికంగా చార్మినార్ జోన్ పరిధిలో 119 కేసులు,రాజేంద్రనగర్ జోన్ లో 102,గోల్కొండలో 98,ఖైరతాబాద్ లో 78,సికింద్రాబాద్ లో 64,జూబ్లీ హిల్స్ లో 54,శంషాబాద్ జోన్ పరిధిలో 52 కేసులను పోలీసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. .డ్రగ్స్ రహిత సమాజం కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆపరేషన్ సేఫ్ స్కూల్ ను ప్రారంభించామని తెలిపారు.విద్యాసంస్థల సమీపంలో గుట్కా,సిగరెట్లు తదితర పొగాకు ఉత్పత్తులు సులభంగా లభించడం వల్ల విద్యార్థులు, యువత తొలుత సరదాగా వాటికి ఆకర్షితులవుతున్నారని,ఆ నికోటిన్ కు క్రమేణా అలవాటు పడి,చివరకు డ్రగ్స్,గంజాయి వంటి తీవ్రమైన వ్యసనాల వైపు మళ్లే అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి ఉందన్నారు.డ్రగ్స్ మహమ్మారికి పొగాకు ఉత్పత్తులే ముఖద్వారం మని,ఈ ప్రమాదకరమైన గొలుసుకట్టును ప్రాథమిక దశలోనే తుంచేయాలన్నదే'ఆపరేషన్ సేఫ్ స్కూల్' ముఖ్య ఉద్దేశం అన్నారు.యువత భవిష్యత్తును నాశనం చేసే హక్కు ఎవరికీ లేదని,ఈ తనిఖీలు ఇక్కడితో ఆగిపోవని,విద్యార్థులు,యువత భద్రత కోసం ఈ సోదాలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. విద్యాసంస్థల పవిత్రతను దెబ్బతీస్తూ,విద్యార్థుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.పాఠశాల, కళాశాల విద్యార్థుల ఆరోగ్యం,భద్రత దృష్ట్యా ,హైదరాబాద్ నగర పోలీసులు ఇకపై ఈ ఉంటారని చెప్పారు.ఈ చట్టవిరుద్ధ కార్యకలాపాల పట్ల'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంభిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. విద్యార్థుల,యువత ప్రాణాలతో చెల గాటమాడుతున్న వారిపై పోలీసులు కఠిన చట్టాలను ప్రయోగించారని, పట్టుబడిన ఉత్పత్తులు, దుకాణదారుల నేర తీవ్రతను బట్టి సిగరెట్లు,ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం కాట్పా ఆక్ట్,భారతీయ న్యాయ సంహిత లోని సంబంధిత సెక్షన్లు, జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 77 మరియు 79,ఈ సిగరెట్ల నిషేధ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశామన్నారు. సామాజి క బాధ్యతగా ప్రజలు,ముఖ్యంగా విద్యార్థు ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలలు లేదా ఇతర విద్యాసంస్థల సమీపంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా సిగరెట్లు,గుట్కా,ఈ సిగరెట్లు లేదా ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని కోరారు.హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ ( హెచ్-న్యూ) ఫోన్ నంబర్ 8712661601కు సమాచారం అందించాలని సూచించారు.ఈ ఆపరేషన్ లో సుమారు 5వేల మందికి పైగా పోలీస్ సిబ్బంది ఏకకాలంలో సోదాల్లో పాల్గొన్నారని,లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు టాస్క్ ఫోర్స్,నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్,హెచ్ న్యూ,రిజర్వ్ పోలీస్ మరియు ప్రత్యేక బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయన్నారు.

# కొల్చారం మండలంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సుడిగాలి పర్యటన..



వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే





**కొల్చారం,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని వరిగుంతం,రంగంపేట,పైతర, గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంగం, సంగాయిపేటలో మంజీరా వ్యవసాయ ఉత్పత్తి దారుల సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రాలను ప్రారంభించారు.

**-ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం,భూమి పూజ..**

పైతరలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు.కోనాపూర్ లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...రైతులు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అన్నారు. తాహసిల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ...వాతావరణంలో మార్పుల వల్ల రైతులు పండించిన పంటలను కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు యబ్బన్నగారి రవితేజరెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్ చారి,సర్పంచులు మోత్కు నిర్మల మల్లేశం,అరిగే,స్వర్ణలత విజయ్ కుమార్,దొడ్ల ఆంజనేయులు,పుర్ర కాంతమ్మ ప్రభాకర్,మోహన్, వినోద్ నాయక్,మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్, యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు,డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ ఆరిగె రమేష్ కుమార్,మాజీ జడ్పిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి, ముత్యంగారి సంతోష్ కుమార్,నరేందర్ రెడ్డి,ఉప సర్పంచ్లు ,తుంకులపల్లి మురళీధర్ రావు,చిట్కుల సురేష్,ఆరె రవీందర్,ఆరట్ల సుధాకర్,సీఈఓ నవీన్, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లి అమరులకు ఘన నివాళులు..

ఆదివాసి,గిరిజన హక్కుల పోరాటానికి చిరస్మరణీయ స్ఫూర్తి..

సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్

**మరిపెడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో 1981ఏప్రిల్ 20న జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆదివాసి,గిరిజన అమరులకు సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ ఘనంగా నివాళులు అర్పించి వారి త్యాగాలను స్మరించుకుంటూ దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ...ఇంద్రవెల్లి ఘటన తెలంగాణ చరిత్రలో ఒక విషాదకరమైన అధ్యాయంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.తమ భూమి,అడవి,జీవన హక్కులు,కనీస సౌకర్యాల కోసం శాంతియుతంగా సమావేశమైన ఆదివాసి,గిరిజనులపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.అధికారిక లెక్కల ప్రకారం13మంది మరణించినట్లు ప్రకటించినప్పటికీ,స్థానిక ప్రజలు,ప్రజాసంఘాల అంచనాల ప్రకారం మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉందని అప్పటి నుంచే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ఈ ఘటనలో అనేక కుటుంబాలు తమ ఆప్తులను కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయాయని గుర్తుచేశారు.ఇంద్రవెల్లి అమరుల త్యాగం ఆదివాసి, గిరిజన హక్కుల ఉద్యమాలకు చిరస్మరణీయ స్ఫూర్తిగా నిలిచిందన్నారు.భూహక్కులు,అడవి హక్కులు,విద్య,వైద్యం,ఉపాధి కోసం పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉందని అన్నారు .ప్రభుత్వాలు ఆదివాసి,గిరిజనుల సమస్యలను తక్షణమే ష్కరించి,అమరుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన కోరారు.ఇంద్రవెల్లి అమరుల త్యాగాలను తరతరాలకు చాటి చెప్పాల్సిన అవసరం ఉందని లిపారు.ఇంద్రవల్లి అమరులకు సిపిఐ జిల్లా సమితి సభ్యులు అబ్దుల్ రహీం జోహార్లు అర్పించారు.



## సీఎం రేవంత్ రెడ్డి బీసీల 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉండాలి..



**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** దేశ ప్రధాని మోడీని విమర్శిస్తే బీసీలంతా ఏకమై తిరగబడతారని మహాత్మ జ్యోతిరావు పూలే యువమంచ్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇండియా కూట మికి బీసీ మహిళల పట్ల చిత్త శుద్ధి ఉంటే బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లపై ప్రేవేట్ బిల్లును పార్ల మెంటులో పెట్టాలని డిమాండ్ చేశారు.సీఎం రేవంత్ రెడ్డి స్థాయిని మరిచి ప్రధానిని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలపై పట్ల ముఖ్యమంత్రికి ప్రేమ ఉంటే 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.రానున్న జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలు 42శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలకు పోవాలన్నారు.

## గడ్డం వెంకటేష్ కు"దళిత రత్న"అవార్డు అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**జల్ పల్లి,ఏప్రిల్20(సూర్యరేఖ)** సమాజంలోని బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ,వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో సేవలందిస్తున్నందుకు గాను గడ్డం వెంకటేష్ కు ఈ అవార్డుకు ఎంపిక అని మంత్రి దామోదరం రాజానరసింహ అన్నారు. సోమవారం మినిస్టర్ క్వాటర్స్ లో మాట్లాడుతూ...సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే తపనతో ప్రజాసేవ కొనసాగించాలన్నారు.డాక్టర్ బాబు జగజీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా బాలాపూర్ కు చెందిన గడ్డం వెంకటేష్ కు ప్రతిష్టాత్మక "దళిత రత్న"అవార్డును సోమవారం,హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రదానం చేశారు.ఆరోగ్యశాఖ మాత్యులు దామోదర్ రాజ నరసింహ,తెలంగాణ ఎంఆర్పిఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ,బిజెర్ యువజన సంగం చైర్మన్ కొప్పుల రాజు ఈ అవార్డును అందజేశారు

## అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన బేడ బుడగ జంగం నాయకులు



**కామారెడ్డి,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్ కి కామారెడ్డి నియోజకవర్గం మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన బేడ బుడగ జంగం కుల సభ్యులు నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తమకు ఎస్సీ ఏ.1.కులం సర్టిఫికెట్ ఇప్పించవలసిందిగా వారు అడిషనల్ కలెక్టర్ ని కోరడం జరిగింది.అడిషనల్ కలెక్టర్ స్పందించి బిఎల్ఎఫ్ కమిటీ ద్వారా గత ఏడాది 9 10 2025 ఎంక్వయిరీ చేపట్టి పూర్తి రిపోర్టును హైదరాబాద్ కమిషనర్ కి పంపించడం జరిగింది చెప్పారు. వృత్తిపరంగా బేడ బుడగ జంగాలని చెప్పి ఎంక్వయిరీలో తేల్చి హైదరాబాద్ కమిషనర్ కి పంపించామని ఎక్స్పర్ట్ టీం కావాలని అడగగా ఎలాంటి ఎక్స్పర్ట్ టీం అవసరం లేదు ఉన్నటువంటి ఆధారాలను పట్టి చేసే వృత్తిని బట్టి ఎస్సీ ఏ వన్ కులం సర్టిఫికెట్ బేడ ని కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు బుడగజంగాలకు ఇవ్వాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు అడిషనల్ కలెక్టర్ వివరించారు అని సంఘ సభ్యులు తెలియజేశారు. ఇట్టి ఆధారంగానే సోమవారం అడిషనల్ కలెక్టర్ విక్టర్ కి కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.అడిషనల్ కలెక్టర్ ఎమ్మార్వో లో కూడా బేడ బుడగ జంగాలకు ఎస్సీ ఏ వన్ కులం సర్టిఫికెట్లు ఇవ్వాలని చెప్పినట్లు వివరించారు.చుక్కాపూర్ గ్రామ సంఘ సభ్యులు జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు తెలిపారు.ఎమ్మార్వోలు తక్షణమే స్పందించి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సంబంధిత కులం సర్టిఫికెట్లు బేడ బుడగ జంగాలకు ఎస్సీ ఏ వన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని సభ్యులు నాయకులు తెలిపార. ఇట్టి కార్యక్రమంలో జన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు,కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండపల్లి సాయిలు,జిల్లా ప్రధాన కార్యదర్శి సంకుపోచయ్య,చుక్కాపూర్ గ్రామ అధ్యక్షులు పళ్లెం లక్ష్మీపతి,నూనె రవి,గిరి వెంకటి, బాలయ్య,రవి,తదితరులు పాల్గొన్నారు

# పేదల హృదయాల్లో నిలిచేది కమ్యూనిస్టులే..

సిపిఐ (ఎం)జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అలువాల వీరయ్య

పుల్లూరు దేవయ్య ప్రథమ వర్ధంతి సభ..



**మరిపెడ,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులు మాత్రమేనని అలాంటి త్యాగమూర్తుల వరసత్వాన్ని కొనసాగించాలని సిపిఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య పిలుపునిచ్చారు.మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం తాళ్ళ ఊకల్ గ్రామానికి చెందిన సిపిఐ(ఎం)గ్రామశాఖ కార్యదర్శి కామ్రేడ్ పుల్లూరు దేవయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామంలో స్థూపావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమానికి వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ...ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని అంటూ చివరి వరకు పోరాడిన దేవయ్య పేదల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిపోతారని ఆయన ఆశయాల కోసం ప్రతి కార్యకర్త కంకణబద్ధలై పనిచేయాలని వీరయ్య కార్యకర్తలను కోరారు.కామ్రేడ్ పుల్లూరు దేవయ్య కడవరకు ఎర్రజెండా నీడలో పేదలకు సేవ చేస్తూ బ్రతికారని,ఆయన అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్న,నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి తపించేవారని,పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు.మండల కమిటీ సభ్యునిగా,వార్డు మెంబర్ గా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామానికి సేవలందించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా, ప్రజానాట్యమండలి కళాకారులుగా,ప్రజలను తన పాటల ద్వారా మేలుకొలిపారని వీరయ్య ఉద్ఘటించారు.దేవన్న అనేక సమస్యలపై దేవన్న నిరంతరం ఆందోళన నిర్వహించే వారిని పార్టీ నుంచి వారి కుటుంబానికి దూరమైన పేదల హృదయలల్లో దేవన్న ఎప్పుడికి నిలిచి ఉంటారని వీరన్న పేర్కొన్నారు.దేవన్న కుటుంబానికి పార్టీ నిరంతరం అండగా నిలబడుతుందని కుటుంబానికి భరోసా కల్పించారు.భవిష్యత్తులో దేవన్న ఆశయాన్ని ముందుకు తీసుకెళ్తామని,దేవన్న ఆశయాన్ని ముందు తీసుకుపోయేలా ఆయన కుమారుడు క్రాంతి,భార్య పద్మ,వారితో పాటు గ్రామ యువతీ యువకులు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం)జిల్లా కమిటీ సభ్యురాలు భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా)జిల్లా అధ్యక్షురాలు కందనూరి కవిత,మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్,కెవిపిఎస్ జిల్లా నాయకులు జిన్న లచ్చన్న,మండల కమిటీ సభ్యులు కందల రమేష్,అల్లి శ్రీనివాసరెడ్డి,నల్లబోలు లక్ష్మారెడ్డి,దిగజార్ల అంతయ్య,షరీఫ్,భయ్యా సురేష్ పుల్లూరి దేవన్న సతీమణి పద్మ,కుమారుడు క్రాంతి కుమార్,కూతురు లావణ్య,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శిశువుకు ప్రాణం పోసిన అమ్మ హాస్పిటల్ వైద్యుడు

వైద్యో నారాయణో..హరి. విగత జీవికి ఊపిరినిచ్చిన డాక్టర్ అజ్మీర భగత్ సింగ్ సేవలకు ప్రశంసల వర్షం



**కారేపల్లి,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** మరణ అంచున ఉన్న ప్రాణాన్ని తిరిగి కాపాడటం వైద్యుడి వృత్తి మాత్రమే కాదు...అది మహోన్నతమైన మానవ సేవ..ఈ మాటలను నిజం చేస్తూ ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో అమ్మ హాస్పిటల్ యాజమాన్యం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ అజ్మీర భగత్ సింగ్ తన అంకితభావంతో మూడు నెలల శిశువుకు మళ్లీ జీవం పోసి అందరి ప్రశంసలు అందుకున్నారు. గుండాల మండలం నాగారం గ్రామానికి చెందిన నవీన్ కుమారుడు అభినేహన్ (3 నెలలు)ఆదివారం మధ్యాహ్నం హృదయ స్పందన,శ్వాస లేకుండా అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఆసుపత్రికి తీసుకువచ్చారు.చిన్నారి పరిస్థితి చూసి కుటుంబ సభ్యులు ఆవేదనతో కన్నీళు పెట్టుకున్నారు. అయితే పరిస్థితి ఎంత విషమంగా ఉన్నా వెనుకడుగు వేయని డాక్టర్ అజ్మీర భగత్ సింగ్, వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అత్యవసర చికిత్స ప్రారంభించి సీపీఆర్ నిర్వహిస్తూ ప్రాణవాయువును అందించారు.వరుసగా మూడు సైకిల్స్ సీపీఆర్ చేయడంతో పాటు అవసరమైన అడ్రినలిన్ మందులు అందించారు.సుమారు గంటన్నరపాటు నిరంతరంగా సాగిన వైద్య ప్రయత్నం ఫలించి,చిన్నారి గుండె మళ్లీ స్పందించడం ప్రారంభించింది.అంతటితో ఆగకుండా చిన్నారి పరిస్థితిని స్థిరపరచేందుకు వైద్య బృందం మరిన్ని కీలక చర్యలు చేపట్టింది.శ్వాస సక్రమంగా కొనసాగేందుకు ఈటీ ట్యూబ్ అమర్చడం,అంబు బ్యాగ్ ద్వారా శ్వాస అందించడం,రక్త ప్రసరణ మెరుగుపరచేందుకు డోపమైన్, డోబ్యూటమైన్ వంటి మందులు ఇవ్వడం జరిగింది.అనంతరం మెరుగైన వైద్యం కోసం చిన్నారిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.డాక్టర్ భగత్ సింగ్ మరియు నర్సింగ్ సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి,అంకితభావం ఒక అమూల్యమైన ప్రాణాన్ని కాపాడాయి."వైద్యో నారాయణో హరి"అన్న సుభాషితం మరోసారి సాక్షాత్కారమైంది.ఈ సంఘటన వైద్యుల పట్ల సమాజంలో గౌరవాన్ని మరింత పెంచడమే కాకుండా, ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసాన్ని బలపరిచింది. చిన్నారికి కొత్త జీవం ప్రసాదించిన డాక్టర్ అజ్మీర భగత్ సింగ్‌కు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి విద్యార్థి ఒక క్రీడాంశాన్ని ఎంచుకోవాలి..

ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్

కొండాపూర్ గురుకులంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు ప్రారంభం..






**ధన్వాడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** క్రీడలతో శారీరక దృఢత్వం మానసిక ఆరోగ్యం సమకూరుతాయని ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్, కొండాపూర్ గిరిజన గురుకులం ప్రిన్సిపల్ ఎం. రాజారాం అన్నారు.సోమవారం కొండాపూర్ గిరిజన గురుకులంలో ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును వారు ప్రారంభించారు.ఈనెల 29వరకు జరగనున్న ఈక్యాంపులో విద్యార్థులకు నెట్ బాల్, కరాటే అంశాల్లో మెలకువలు నేర్పుతారు.ఈ శిబిరానికి కొండాపూర్,పెద్దమందడి,మన్ననూరు గిరిజన గురుకులాల విద్యార్థులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు ఎస్ఐ మాట్లాడుతూ...విద్యార్థులు చిన్నప్పటినుండే క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని సూచించారు.క్రీడల్లో రాణించిన వారు అన్ని అంశాలలో చురుకుగా ఉంటారని తెలిపారు.తమ నిత్యజీవితంలోనూ ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించుకుంటారని పేర్కొన్నారు.గురుకులం ప్రిన్సిపల్ ఎం.రాజారాం మాట్లాడుతూ...గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి ఆదేశాల మేరకు కరాటేలో కూడా విద్యార్థులకు శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు.ఈ విద్యా సంవత్సరంలో తమ ఇంటర్ విద్యార్థులు 98శాత ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.సీనియర్ లెక్చరర్ జి..లక్ష్మయ్య మాట్లాడుతూ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. నెట్ బాల్ అకాడమీ కోచ్ డాక్టర్ రాంమోహన్ గౌడ్ మాట్లాడుతూ గిరిజన గురుకుల లో మెరికల్లాంటి క్రీడాకారులు ఉన్నారని తెలిపారు.వారిలో దాగి ఉన్న ప్రతిభాపాటవాలన వెలికి తీయడంలో భాగంగానే ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కరాటే శిక్షకులను శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు కరాటే ఆత్మ రక్షణ కొరకు ఉపయోగపడుతుందని తెలిపారు.అనంతరం ఆయన వారికి కరాటే మెలుకువలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపల్ సాంబ్యా నాయక్,క్యాంప్ ఇంచార్జ్ ఆంజనేయులు,పిడి రవీందర్,ఉపాధ్యాయులు,అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నాకట్టుగూడెంలో నీటి సమస్యకు పరిష్కారం..

బోర్ వేయించి ఉపశమనం కలిగించిన పంచాయతీ

సర్పంచ్ కృష్ణవేణి వీరబాబు




**కారేపల్లి,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** గుంపెళ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నాకట్టుగూడెం గ్రామంలో ఎన్నో రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యకు గౌరవ సర్పంచ్ శ్రీమతి గుగులోత్ కృష్ణవేణి -వీరబాబు సమయో చితంగా స్పందించారు. వారి ప్రోత్సాహంతో స్వచ్ఛంద సేవ ఫౌండేషన్ సహకారంతో గ్రామంలో బోర్ వేయించడం ద్వారా నీటి సమస్యకు పరిష్కారం చూపించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంతోష్ నాయక్,ఉపసర్పంచ్ శంకర్,వార్డ్ సభ్యుడు రమేష్ తో పాటు గ్రామస్థులు రాములు,లక్ష్మణ్,భద్రు తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపిలో చేరిన 200 మంది యువకులు.



**కామారెడ్డి,ఏప్రిల్20(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన భారత రాష్ట్ర సమితి కాంగ్రెస్ పార్టీలో చెందిన యువకులు సోమవారం భారతీయ జనతా పార్టీలు చేరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజు,లు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ...యువకులు స్వచ్ఛందంగా పార్టీలోకి రావడం సంతోషకర విషయమని అన్నారు. రానున్న జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పైడి ఎల్లారెడ్డి తెలిపారు.దేశం కోసం ధర్మం కోసం యువత పాటుపడాలని ఆయన అన్నారు.భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న పలు సంక్షేమ పథకాలు వేరే ఏ దేశంలో కూడా అమలు కావడం లేదని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్రావు,వివిధ మండలాలకు చెందిన అధ్యక్షులు సంపత్ రెడ్డి,క్రాంతి కుమార్,సంతోష్ రెడ్డి నర్సింలు,గంగారెడ్డి,జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీ యోగా రామ్ రెడ్డి, తోపాటు వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## నేతకాని కులానికి గెజిట్‌లో ప్రత్యేక గుర్తింపుకై వినతి..



**మంచిర్యాల,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ కులాల జాబితాలో మార్పులు చేసి నేతకాని కులానికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు,రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు మాట్లాడుతూ...తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ, కులగణనలో నేతకాని మహర్ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేతకాని కులస్తులు మాలలకు ఉపకులం కాదని స్పష్టం చేస్తూ,ప్రస్తుతం గెజిట్‌లో ఉన్న"మాలసాలె", "నెట్కాని" పేర్లను తొలగించి"నేతకాని"అనే పేరును ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరారు.రాష్ట్రంలో సుమారు 15లక్షలకు పైగా జనాభా కలిగిన నేతకాని కులాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రస్తుతం కుల ధృవీకరణ పత్రాల్లో నేతకాని పేరుతో సర్టిఫికెట్లు పొందుతున్నప్పటికీ, ఇటీవలి సమగ్ర కుటుంబ సర్వే,కుల సర్వేల్లోఈ కులాన్ని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. తమకంటే తక్కువ జనాభా కలిగిన కులాలను గుర్తించి, పెద్ద సంఖ్యలో ఉన్న నేతకాని కులాన్ని పక్కన పెట్టడం సరైంది కాదన్నారు.అదేవిధంగా, నేతకాని కులాన్ని మాలలతో కలిపిన గ్రూప్ నుండి తొలగించి, మొదటి గ్రూపులో చేర్చి 3శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే నేతకాని జనాభా వివరాలను అధికారికంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు ఈ వినతి పత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెరుగు తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి కొండగొర్ల శ్రీనివాస్, జునుగురు లక్ష్మణ్,జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితి రోగులను మహబూబ్నగర్ ఆసుపత్రికి రిఫర్ చేయాలి...

**ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఇద్దరు మృతి..**

**నారాయణపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ వద్దు.. కిష్టాపూర్ సర్పంచ్ ఆవేదన**




**ధన్వాడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** ప్రమాదం జరిగి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను ధన్వాడ ఆసుపత్రికి తరలిస్తే ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ధన్వాడ మండలం కిష్టాపూర్ సర్పంచ్ కొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల జరిగిన రెండు సంఘటనలే అందుకు నిదర్శనం అన్నారు.కిష్టాపూర్ గ్రామంలో మూడో తరగతి చదువుతున్న బాలునికి పాము కాటు వేయగా అత్యవసర చికిత్స నిమిత్తం ధన్వాడ ఆసుపత్రికి తీసుకువస్తే ఇక్కడి నుంచి నారాయణపేట ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేయడం జరిగిందన్నారు.అక్కడ అనుకున్నంత స్థాయిలో డాక్టర్లు లేకపోవడంతో మళ్లీ అక్కడి నుంచి మహబూబ్నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందని సర్పంచ్ చెప్పుకొచ్చారు.పాము కాటు వేసిన బాలుని ధన్వాడ నారాయణపేట మహబూబ్నగర్ ఆసుపత్రిలకు తరలించడం వల్ల సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో బాలుడు మృతి చెందినట్లు సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా ఈనెల18న మణుపూర్ తాండ వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తిని చికిత్స నిమిత్తం ధన్వాడ ఆసుపత్రికి తరలిస్తే మళ్లీ అక్కడి నుంచి నారాయణపేట ఆసుపత్రికి తరలించడం జరిగింది. మళ్లీ నారాయణపేట ఏరియా హాస్పిటల్ నుంచి మహబూబ్నగర్ ఏరియా చనిపోవడం జరిగిందని సర్పంచ్ వాపోయారు .ఇలా సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో ఇద్దరు వ్యక్తులు అకారణంగా చనిపోయాడని ఈ విషయంలో అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధన్వాడ ధన్వాడ ఆసుపత్రికి అత్యవసర సమయంలో ఎవరైనా రోగులను చికిత్స నిమిత్తం తీసుకొస్తే నారాయణపేట కాకుండా మహబూబ్నగర్ రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు.ఇకనుంచి తీసుకుపోయిన మళ్లీ మహబూబ్నగర్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని సర్పంచ్ కొండయ్య అన్నారు. సరైన సమయంలో చికిత్సలు అందకపోవడం వల్లే విధంగా జరుగుతుందన్నారు. నారాయణపేట ఏరియా ఆసుపత్రిలో సరైన వసతులు లేకపోవడంతో కిష్టాపూర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు చనిపోవడం చాలా బాధాకరమన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు..



**శివంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలంలోని చెన్నాపూర్ గ్రామానికి చెందిన మరికంటి అశోక్ ఉ ప్రశాంతి ఎనిమిదో వార్డ్ మెంబర్ సభ్యురాలు దంపతులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. సోమవారం రోజున గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యతిధిగా మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి,మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..."ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది.పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం"అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, మాజీ ఎంపిటిసి మన్నె నర్సింలు,మార్చి నూరి శ్రీశైలం యాదవ్,సింగిరెడ్డి రాజిరెడ్డి,సింగిరెడ్డి అంజిరెడ్డి ,గ్రామ అధ్యక్షులు బోయిని రవీందర్ యాదవ్, సిరిపురం నాగభూషణం, సిరిపురం కృష్ణ,బోయిని నాగరాజు వార్డు సభ్యులు వరలక్ష్మి రాములు,ఈటబోయిన మల్లేశా,బొల్ల బిక్షపతి ప్రముఖ వ్యాపారవేత్త బొమ్మల సత్తయ్య, వెంకయ్య తాండ సర్పంచ్ బానోత్ వినోద్,మురళీధర్ రెడ్డి, రాజు,తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనతో అభివృద్ధి..**

**అవగాహన సమావేశంలో అధికారులు**

**రాజేంద్రనగర్,ఏప్రిల్20(సూర్యరేఖ):** ప్రజాపాలన కార్యక్రమంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు తెలిపారు.99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కింద యూసీడీ కార్యకలాపాలు ,ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం కిస్మత్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.ఈ సమావేశానికి వివిధ కార్పొరేషన్ల నుండి మైనారిటీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల సిబ్బంది హాజరై తమ తమ విభాగాల్లో అమలవుతున్న పథకాలపై సంక్షిప్తంగా వివరించారు.ఈ సమావేశంలో ఇందిరా మహిళా శక్తి పథకం,ఉచిత బస్సు పథకం,గృహలక్ష్మీ పథకం,గృహజ్యోతి పథకం,ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది,అంగన్వాడీ వర్కర్లు,ఆశావర్కర్లు, స్థానిక మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..

**సిపిఎం నాయకులు నందిపాటి వెంకన్న**



**మరిపెడ,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని సిపిఎం నాయకులు నందిపాటి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో కొమ్ముగుంట రాళ్ల దగ్గర జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ...గ్రామంలో సుమారు1200మంది ఉపాధి కూలీలు ఉండగా వారంతా 9వారాల నుండి పనిచేస్తున్నట్లు తెలిపారు.పనిచేస్తున్న ప్రదేశం ఎంతో దూరం ఉన్నప్పటికీ పనిచేయాలని ఆలోచనలతో కూలీలు ఎండలో కాలి నడకన నడుచుకుంటూ కిలోమీటర్ల కొద్ది దూరం వెళుతున్నారని తెలిపారు.అంతేగాక పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవన్నారు.కూలీలకు సౌకర్యాలు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం వైదొలిగిందని వెంకన్న ఆరోపించారు.పనికి కావలసిన పారలు,తట్టలు,ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఇవ్వకుండా నిధుల కొరత విధించిందని ఆరోపించారు.జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్పిడి పేరుతో ఉపాధి చట్టానికి తూట్లు పెట్టి ఉపాధి పథకంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.కనీసం చేసిన పనికైనా డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారం రోజులలో డబ్బులు కూలీలకు చెల్లించుకుంటే ఇదే కూలీల చేత ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు,వార్డు సభ్యులు,అంబేద్కర్ యువజన సంఘం గ్రామ నాయకులు,ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడిపై దాడి అమానుషం..

**కఠినంగా శిక్షించాలన్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు**



**చెన్నూర్,ఏప్రిల్20(సూర్యరేఖ)** భీమారం మండల బీఆర్ఎస్ నాయకునిపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన హత్యాయత్నాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గ్రామ నిధుల దుర్వినియోగంపై సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు సుంకరి గోపాల్ అనే నాయకుడిని కిడ్నాప్ చేసి నిర్మానుష్య ప్రాంతంలో తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.ఈ దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని రాజకీయ వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూల రాజిరెడ్డి,వేముల శ్రీకాంత్ గౌడ్,జనం పెల్లి సమ్మయ్య, వేముల ప్రణీత్ గౌడ్,జలంపల్లి తిరుపతి,మంతెన సమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి..

**కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి**

**గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు పరిశీలన..**



**మరిపెడ,ఏప్రిల్20(సూర్యరేఖ)** నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లచ్యా తండా గ్రామ పంచాయతీలో నిర్మాణంలో ఉన్న నూతన గ్రామ పంచాయతీ భవన పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి,పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ...భవన నిర్మాణం గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా,నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలన్నారు.అలాగే గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్,కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెద్దబోయిన ఐలమల్లు, నాయకులు అక్కినపల్లి వెంకట్ సాయి,స్థానిక నాయకులు ,గ్రామ పెద్దలు,తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25 న కవిత పార్టీ ఆవిష్కరణకు భారీగా తరలివెళ్లనున్న కార్యకర్తలు



**దామరగిద్ద,ఏప్రిల్20(సూర్యరేఖ):** తెలంగాణ జాగృతి పార్టీ ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని నారాయణపేట్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు.సోమవారం జిల్లా కార్యకర్తలు బాపన్ పల్లి గ్రామంలో సమావేశమయ్యారు.ఈ నెల 25 న కవిత ఆధ్వర్యంలో స్థాపించబోయే నూతన పార్టీ ఆవిష్కరణసభకు జిల్లా నుంచి తరలిరావాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అందరూ ముఖ్య నాయకులు సమావేశమై జిల్లా నుంచి 1500 మందిని 30 బస్సుల్లో తరలించడం కోసం గ్రామాల వారీగా రూట్ మ్యాప్,గ్రామాల వారిగా ఇంచార్జిలను నియమించారు.అదే విధంగా 30 ట్రాక్టర్ లలో కూడా రైతులను తరలించడం కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.అన్ని మండలాల్లో కేటాయించిన బస్సులు ఆయా ఇంచార్జిలు ప్రజలను ఎక్కించుకొని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.ఉదయం 8 లోపు మునీరాబాద్ లోని ఆధ్వయ ఫంక్షన్ హాల్ కు రావాలని జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గం బాధ్యులు నీలి జనార్దన్,జిల్లా యువత అధ్యక్షులు మనోజ్,మద్దూర్ అధ్యక్షులు సందమొళ్ల శ్రీనివాస్,కొత్తపల్లి అధ్యక్షులు శివశంకర్,గుండుమాల్ అధ్యక్షులు రమేష్,నర్సింహారెడ్డి,నారాయణ రెడ్డి,బల్చందర్,బీషాప్ప కాందేన్ పల్లి మాజి ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్,వివిధ గ్రామాల నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాల,మహిళల అభివృద్ధిని అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు

**దామరగిద్ద,ఏప్రిల్20(సూర్యరేఖ):** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు,డీలిమిటేషన్ బిల్లు అమలు కాకుండా ప్రతిపక్ష పార్టీలు అడ్డుకోవడం వలన దక్షణాది రాష్ట్రలలో లోకసభ స్థానాలు పెరుగకుండా,చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు కాకుండా ప్రతిపక్ష పార్టీలు చేయడం వలన దక్షణాది రాష్ట్రాల,దేశంలోని మహిళల అభివృద్ధికి అడ్డుపడ్డారని సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ తెలిపారు.దేశంలో మూడు సార్లు డీలిమిటేషన్ చేస్తే దక్షణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. మొదటి సారి 1953 లో ఉత్తరాది రాష్ట్రాలకు 9 లోకసభ సీట్లు పెంచితే,దక్షణాదికి 1 లోక్ సభ సీటు పెంచారని,రెండవ సారి 1963 లో ఉత్తరాదికి 29 సీట్లు పెంచితే,దక్షిణాదికి 2 సీట్లు పెంచారని తెలిపారు.మూడవసారి 1973 లో



ఉత్తరాదికి 17 లోకసభ సీట్లు పెంచితే,దక్షిణాదికి 3 సీట్లు పెంచి అన్యాయం చేసిన వారు ఎవరో చెప్పాలని కోరారు.ఈ డీలిమిటేషన్ బిల్లులో దక్షణాదికి అన్యాయం జరుగరాదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గంట సమయం ఇవ్వండి బిల్లు సవరణ చేసి జనాభా ఆధారంగా కాకుండా ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సీట్లు 50 శాతం పెంచుతామంటే ఎందుకు ఒప్పుకోలేదో దేశ ప్రజలకు చెప్పాలని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కాకుండా అసత్యపు ఆరోపణలు చేయడం వలన లోకసభ సీట్లు,మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కాకుండా విగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవేళ 2011,2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది కానీ ప్రతి రాష్ట్రంలో కూడా 50% లోకసభ సీట్లు పెంచితే అన్యాయం ఎలా జరుగుతుందో ఈ బిల్లు ఆడుకున్న వారు చెప్పాలని అన్నారు.ఇప్పటికైనా చేసిన పొరపాటు సరిదిద్దుకొని ఈ బిల్లులు అమలు చేయుటకు సహకరించాలని కోరారు.

# దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు





**మందమర్రి,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ ప్రారంభించారు .గ్రామస్తుల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ చలివేంద్రాన్ని స్థానిక ప్రజలు స్వాగతించారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు సింగరేణి యాజమాన్యం సహకరించాలని గ్రామసర్పంచ్ సెగ్యం వెంకటేష్ అదికారుల దృష్టికితీసు కెళ్ళడంతో స్పందించిన సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఆర్కె5 గ్రూప్ ఏజంట్ శ్రీదర్ కుమార్,శ్రీరాంపూర్ ఏరియా సివిల్ ఇంజనీర్ హనుమాన్ గౌడ్,లు వెంకటాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించారు.గ్రామంలో వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు.త్వరలోనే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి గ్రామస్థులకు శుద్ధమైన త్రాగునీరును అందించడం జరుగు తందన్నారు.అంతేకాకుండా గ్రామంలో యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ మాట్లాడుతూ...గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు గ్రామపంచాయతీ కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే.ప్రశాంత్, ఉపసర్పంచ్ సుద్దుల రాజేశ్వరి నరేందర్, వార్డ్ సభ్యులు వేల్పుల మహేశ్వరి--సాగర్,మాస్ సం తోష్, పూదరి ప్రశాంత్,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజపాలనతో అభివృద్ధి.. అవగాహన సమావేశంలో అధికారులు








**రాజేంద్రనగర్,ఏప్రిల్20(సూర్యరేఖ):** ప్రజాపాలన కార్యక్రమంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు తెలిపారు.99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కింద యూసీడీ కార్యకలాపాలు ,ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం కిస్మత్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించా రు.ఈ సమావేశానికి వివిధ కార్పొరేషన్ల నుండి మైనారిటీ,ఎస్సీ,ఎస్టీ,బీసీ కార్పొరేషన్ల సిబ్బంది హాజరై తమ తమ విభాగాల్లో అమలవుతున్న పథకాలపై సంక్షిప్తంగా వివరించారు.ఈ సమావేశంలో ఇందిరా మహిళా శక్తి పథకం, ఉచిత బస్సు పథకం,గృహలక్ష్మీ పథకం,గృహజ్యోతి పథకం,ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ఈ పథకాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది,అంగన్వాడీ వర్కర్లు,ఆశావర్కర్లు,స్థానిక మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్..

**రామాయంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రిషి ఫీల్డింగ్ స్టేషన్ మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. .రామాయంపేట పట్టణం వ్యాపార పరంగా మరింత అభివృద్ధి జరగవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.పెట్రోల్ బంక్ ద్వారా పలువురికి ఉపాధి అవకాశాలు సైతం లభిస్తాయని చెప్పారు.పట్టణంలో వ్యాపారాలు చేసుకునే వారికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు.కార్యక్రమంలో





మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు..



**శివంపేట,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని కొంతాన్ పల్లి గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయబడింది .ఈ కార్యక్రమాన్ని పిఎసిఎస్ తాజా మాజీ చైర్మన్డగ్రామ సర్పంచ్ శ్రీమతి చింతల విజయ-వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిం చి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుతం ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో గ్రామంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలు ఎండల నుండి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాధిక,గ్రామ ఉపసర్పంచ్ బొల్లారం కుమార్,వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్,సారా శంకర్ లాల్,గుండు వేణుగోపాల్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ,వేసవికాలంలో ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు

## ఉరి వేసుకొని గృహణి ఆత్మహత్య.



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** ఓ గృహణి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ ఎన్‌ఎఫ్సి కాలనీకి చెందిన శివ,సుమలత (36)భార్యాభర్తలు .వీరికి 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది.వివాహం జరిగి పది సంవత్సరాలు అయిన సంతానం కలగలేదు.అనారోగ్య సమస్యలతో పాటు సంతానం కలగలేదని తరచూ సుమలత బాధపడేది.సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.విషయం గమనించిన కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచానామ నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శుభకార్యానికి హాజరైన వంటేరు ప్రతాప్ రెడ్డి,సునీత లక్ష్మారెడ్డి.



**శివంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** మెదక్ జిల్లా శివంపేట మండలంలోని చండి గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పుల్లగుర్ల ముత్యంరెడ్డి ఏకైక కూతురు అక్షిత రెడ్డి-సాయినాథ్ రెడ్డి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా,తాజా మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ,మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణగౌడ్,చండి గ్రామ సర్పంచ్ గైనిభైటి ప్రవీణ్ గౌడ్,ఉపసర్పంచ్ సౌజన్య నరేష్,చండి గ్రామ మాజీ సర్పంచ్,మరియు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## బసవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవినోళ్ల శ్రీనివాస్



**దామరగిద్ద, ఏప్రిల్20 (సూర్యరేఖ):** బసవ జయంతిని పురస్కరించుకొని బాపన్ పల్లి పత్రి బసన్న దేవాలయ ంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్య క్షులు, బాపన్ పల్లి సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం చేశారు.ఈ సందర్భంగా గవినోళ్ల శ్రీనివాస్ ను మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో యాదగిరి, సంతోషం, గవినోళ్ల జనార్దన్,ఎరుకలి రాములు,దొబ్బలి రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..







ప్రజాపాలనతో ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరువ..

అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య

**రాజేంద్రనగర్,ఏప్రిల్20(సూర్యరేఖ)** ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే ప్రజా పాలన కార్యక్రమమని అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య అన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘ సభ్యురాళ్లకు వివిధ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కార్యక్రమం,యుసీడి జిహెచ్ఎంసి అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య ఆధ్వర్యంలో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు .అందులో భాగంగానే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆరు గ్యారెంటీలు అందుతాయన్నారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ,ప్రజలు భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ మల్లయ్య అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో ప్రభుత్వ విభాగాలు రెవెన్యూ,ఐసిడిఎస్, హెల్త్, బ్యాంకింగ్, బీసీ, ఎస్టీ ,ట్రైబల్,మైనారిటీ శాఖల అధికారులు, శాఖలకు సంబంధించిన పథకాల గురించి క్షుణ్ణం గా వివరించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాములు,ఐసీడీఎస్ కవిత,డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పూనమ్,ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాములు ,ప్రాజెక్ట్ అధికారి కరుణాకర్, సీఓలు, ఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం..







రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**గండిపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** పేదలకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు వరమని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.గండిపేట మండలం కల్యాణ లక్ష్మి,శాదీ ముబారక్ పథకాల కింద చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన 104మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..పేద ప్రజలు ఇలాంటి సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాల న్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుంద న్నారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎంతో మంది యువతుల వివాహానికి ఆర్థిక ఆదుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు .ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు నేరుగా లబ్ధిదారులకు అందేది కాదన్నారు .ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైనా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు.ఆడపిల్లల వివాహాలు నిరుపేద తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఇంతటి బృహత్తర పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఈ పథకాలు వచ్చాక ఆడపిల్లల తల్లిదండ్రులు పెద్దగా ఆర్థిక ఇబ్బందులు పడకుం డా తమ కుమార్తెల వివాహాలను వైభవంగా జరిపించుకుంటున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు పేద, మైనారిటీ కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు .వారి వివాహ ఖర్చుల భారం తగ్గిం చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నంబర్ 371లో చెత్తను డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి..

**మేడ్చల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** మేడ్చల్ సర్కిల్ పరిధి పూడూరు-కిష్టాపూర్ డివిజన్ లోని పూడూరులో ఉన్న సర్వేనెంబర్ 371లో చెత్తను డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ డీఈ విజయలక్ష్మిలకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ...పూడూరు గ్రామపంచాయతీగా ఉన్న సమయం నుండి ఇక్కడకు ఇంటింటి నుండి సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించి డంపింగ్ చేస్తున్నారని తెలిపారు.371సర్వే నెంబర్ లో 17ఎకరాల 8 గంటల స్థలం ఉందని గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో అర్హులైన ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలకు వ్యవసాయం చేసుకోవడానికి ఈ భూమిని పంపిణీ చేసి పట్టాలు అందజేసినట్లుగా గుర్తు చేశారు.ఐతే ఇందులో కొంతమంది రైతులకు నీరు పడక వ్యవసాయం చేయకుండా వదిలేయడంతో బీడు భూములుగా మారాయి.ఇదే అదునుగా తీసుకున్న అప్పటి గ్రామ పంచాయతీ అధికారులు ఇక్కడ చెత్తను డంపింగ్ చేయడం మొదలుపెట్టినట్లుగా తెలియజేశారు. గ్రామపంచాయతీ నుండి మేడ్చల్ మున్సిపాలిటీగా,ఆ తర్వాత జీహెచ్ఎంసీ ఇప్పుడు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయిందన్నారు.ఐతే ఇక్కడికి ప్రస్తుతం పూడూరు గ్రామంతో పాటుగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మొత్తం చెత్తను వాహనాల ద్వారా తరలిస్తున్నారని అన్నారు.ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడం వలన చుట్టుపక్కల తీవ్రమైన దుర్గంధం వెలువడుతుండడంతో పాటుగా భూగర్భ జలాల కాలుష్యం,వాయు కాలుష్యం, వాతావరణ కాలుష్యం,జీవ వైవిద్యం, జంతువులు ప్రజల ఆరోగ్యలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ డంపింగ్ యార్డ్ కు సమీపంలోనే ప్రతిష్టాత్మకమైన నల్సార్ యూనివర్సిటీఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ప్రైజెస్ కళాశాల,వ్యవసాయ భూములు ఉన్నాయని చెప్పారు.వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు కోలా వెంకటేష్,శేఖర్ రెడ్డి,తుపాకుల కృష్ణ,గ్రామస్తులు భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## గురు పీఠంలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం..





**శివంపేట,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** శివంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలోని గురు పీఠంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను గురు పీఠం వ్యవస్థాపకులు పెద్దగోని శివకుమార్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు.ప్రారంభ కార్యక్రమానికి సర్పంచ్ బ్యాగరి నరసయ్య,మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ,టిఆర్ఎస్ నాయకులు యాదగౌడ్ , జిన్నారం శ్రీనివాస్ గౌడ్,జిన్నారం పెద్దగొని సూర్యం, ఉషగొని శంకర్,బిక్షపతి,వంజరి కొండల్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్లాంట్‌లోని యంత్రాంగాన్ని పరిశీలించి,శుద్ధి చేసిన నీటిని ఎలా సరఫరా చేస్తారో వివరాలు తెలుసుకున్నారు.ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఖానాపూర్ రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటాం..

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





**గండిపేట్,ఏప్రిల్20(సూర్యరేఖ)** ఖానాపూర్ రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటాని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు .గండిపేట్ మండలం ఖానాపూర్ గ్రామం సబితానగర్‌లో రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లను కోల్పోయిన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది.రోడ్డు వైండింగ్‌లో ఇళ్లు కోల్పోయిన 170 బాధిత కుటుంబాలకు పునరావాసం కల్పిస్తూ,వారికి కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రభుత్వం కేటాయించింది.ఈ ఇళ్లకు సంబంధించిన పట్టాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల కోసం ఇళ్లను త్యాగం చేసిన పేదలందరికీ తగిన న్యాయం చేయాలనే ఉద్దేశంతో వారికి మెరుగైన వసతులతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు.పారదర్శకమైన పద్ధతిలో అర్హులైన 170 మందికి ఈ కేటాయింపులు జరిగాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,రెవెన్యూ అధికారులు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తమకు గూడు కల్పించినందుకు లబ్ధిదారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే,ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నిద్రిస్తున్న వ్యక్తిపై వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన దుండగుడు..





**రాజేంద్రనగర్,ఏప్రిల్20(సూర్యరేఖ)** నిద్రిస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి బ్లేడుతో దాడికి పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే...అత్తపూర్ సులేమాన్ నగర్‌లో రెహానా అనే వ్యక్తి నిద్రిస్తుండగా మరో వ్యక్తి బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు.గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు.తనను ఫర్నిచర్ షాపులో పనిలోంచి తొలగించి రెహానాను పెట్టుకోవడంతో దుండగుడు ఆగ్రహంతో దాడికి పాల్పడినట్లు తెసింది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయం..





మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ

**మేడ్చల్,ఏప్రిల్20(సూర్యరేఖ)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ పరిధిలోని యాదారం మంజుల అశోక్,సాదరి దుర్గమ్మ,గిర్మాపూర్ గ్రామానికి చెందిన తలారి భాగ్యలక్ష్మీసురేష్,గొంగుల వెంకటమ్మ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ...ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు,పట్టణాలు లేవని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ హౌసింగ్ కార్పొరేషన్ డిఇ అశోక్ రెడ్డి,ఏఇ సుభాష్ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ ఉదండపురం సత్యనారాయణ,మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ,మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ,మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణా రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి,మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగరేణి పోచయ్య,బొక్క రఘుపతి రెడ్డి,రామన్నగారి సంతోష్ గౌడ్,బండి శ్రీనివాస్ గౌడ్,పంజగారి ఆంజనేయులు,నవీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వడగండ్ల విరుచుకు పాటు.. రామయంపేట రైతుకు కన్నీటి పంట..

అకాల వాన ఆగ్రహం..వరి నేలపాలు మామిడి తోటపై విపత్తు..

రామాయంపేట మండలం అకాల వర్షం రూపంలో ప్రకృతి కరుణ కాదు...కరాళరూపం దాల్చింది. వడగండ్ల వానతో రామాయంపేట మండలంలో రైతుల కన్నీళ్లు పంట పొలాల్లో కలిసిపోయాయి. కోతకు వచ్చిన వరి నేలమట్టమైపోగా,మామిడి తోటలు కళ్లముందే చిద్రమయ్యాయి.





**రామయంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** రామాయంపేట మండలంలో నిన్న సాయంత్రం కురిసిన అకాల వర్షం,వడగండ్ల వాన రూపంలో రైతాంగంపై విరుచుకుపడింది.కోత దశలో ఉన్న వరి పంట భారీగా దెబ్బతింది.పొలాల్లోనే వడ్లు రాలిపోవడంతో ప్రతి రైతు సుమారు 20శాతం నుంచి 40శాతం వరకు నష్టపోయినట్లు అంచనా వేస్తున్నారు.దీంతో ఈ సీజన్‌లో వరి దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం నెలకొంది. ఇక మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వడగండ్ల దెబ్బకు అనేక తోటల్లో మామిడికాయలు నేలమట్టమైపోయాయి. సంవత్సరాంతం కష్టానికి ప్రతిఫలం దక్కాల్సిన సమయంలో ఈ విపత్తు రైతులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది.

**-పాలనపై ఆగ్రహం..**

ఇంతటి నష్టం జరిగినప్పటికీ రెవెన్యూ,వ్యవసాయ శాఖ సిబ్బంది ఇంకా స్పందించకపోవడం రైతుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.ఎక్కడెక్కడ ఎంత నష్టం జరిగిందో సర్వే చేయకపోవడం, పరిహారం అంచనా వేయకపోవడం బాధాకరమని రైతులు వాపోతున్నారు.నష్టపోయిన రైతాంగానికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది.జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకొని బాధిత రైతులను ఆదుకోవాలని కోరింది.కష్టానికి కన్నీళ్లు మాత్రమే మిగిల్చిన ఈ వడగండ్ల వాన రైతాంగాన్ని కుదేలు చేసింది.ప్రకృతి విపత్తు కంటే ప్రభుత్వ నిర్లక్ష్యం మరింత బాధ కలిగిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సహాయం అందకపోతే ఈ నష్టం రైతుల భవిష్యత్తునే చీకటిలో నెట్టివేస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు,కిషన్ మోర్చా జిల్లా నాయకులు చిన్నోళ్ల రంగన్న,పట్టణ నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హిమాయత్ సాగర్,కిస్మత్పూర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**రాజేంద్రనగర్(బండ్లగూడ),ఏప్రిల్20()**

హిమయత్‌సాగర్ సెక్షన్‌లో ఇంటర్‌లింకింగ్,ఫీడర్ బైఫర్కేషన్ పనుల నిమిత్తం11కేవీ ఫీడర్లపై మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు.ఉదయం 09:00గంటల నుండి. ఉదయం11:00గంటల వరకు గంధమ్‌గూడ సబ్-స్టేషన్ నుండి వెలువడే 11కేవీ రిచ్‌మండ్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన కీర్తి రిచ్‌మండ్ విల్లాస్, పిడటికాలనీ ఎ,బి,సి,డిలోని కొంత భాగం,స్పెషల్ బ్లాక్స్,హైదర్షకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వరకాలనీ,డైమండ్ వ్యాలీ, ప్రస్తాహ్ నగర్,తిరుమల గార్డెన్,రాధారీట్రీట్స్ ఫేజ్-××, పావని హార్మొనీ విల్లాస్,బచ్‌పన్ స్కూల్,పద్మశ్రీ హిల్స్ మెయిన్ రోడ్‌లోని కొంత భాగం,సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన హిమాగిరినగర్, గంధమ్‌గూడ,వెస్ట్ ఎండ్ కాలనీ ,శాంతినగర్,లక్ష్మీ నగర్,హైదర్ షాకోట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**-కిస్మత్ పూర్ లో..**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ.మల్లేష్ రాజ్ తెలిపారు.సెక్షన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిర్వహణ,చెట్లు నరికే పనుల నిమిత్తం సాయంత్రం4:30నుండి 05:00 గంటల వరకు ధాత్రి ఎన్‌క్లేవ్ పరిధిలోని శ్రీనివాసం ఎన్‌క్లేవ్,ఓంనగర్,ధాత్రి ఎన్‌క్లేవ్,ఆనంద్ నగర్, శ్రీనివాసం ఎన్‌క్లేవ్,అశోక్ విహార్,సైబర్ శాంతి, పలాసియో విల్లాస్ మొదలైన ప్రభావిత ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

## ఐక్యతే బలం..నర్సాపూర్లో పిఏసిఎస్ సిబ్బంది యూనియన్ కు కొత్త శక్తి..

మెదక్ జిల్లా పిఏసిఎస్ సొసైటీ సిబ్బంది ఐక్యబలం మరోసారి చాటుకుంది.నర్సాపూర్‌లో జరిగిన కీలక సమావేశంలో యూనియన్‌ను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూ,కొత్త పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషంగా నిలిచింది.




**రామాయంపేట,ఏప్రిల్20(సూర్యరేఖ)** నర్సాపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆదివారం సిబ్బంది ఐక్యతకు వేదికగా మారింది.మెదక్ జిల్లా పిఏసిఎస్ సొసైటీ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో యూనియన్ భవిష్యత్ దిశపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.సమావేశంలో ప్రధానంగా సొసైటీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం,వారి హక్కుల పరిరక్షణ,మరియు యూనియన్ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది.అనంతరం యూనియన్ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.నూతన పాలకవర్గం.. అధ్యక్షుడు యు.రవీందర్, ఉపాధ్యక్షులు డి.మధు,బి.కృష్ణ,ప్రధాన కార్యదర్శి టి.నవీన్,ట్రెజరర్ ఎండి.అమీర్ అలీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.నవీన్, జాయింట్ సెక్రటరీ కే.సాయి కిరణ్, సభ్యులు పి.వెంకటస్వామి,సిహెచ్.దినేష్, బి.రమేష్,పి. శ్రీనివాస్,వి.స్వామి,జి.సిద్ధిరాంరెడ్డి,పి.శోభారాణి,ఎం.వేణుగోపాల్ -సంకల్పం..కొత్తగా ఎన్నికైన నాయకులు సిబ్బంది సంక్షేమం, హక్కుల పరిరక్షణ,మరియు సమస్యల పరిష్కారంలో కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా అనేక సొసైటీ సిబ్బంది హాజరై యూనియన్‌కు తమ మద్దతు తెలిపారు.-ముఖ్యసందేశం.. “మన ఐక్యతే మన బలం”అనే నినాదంతో సమావేశం ముగిసింది .యూనియన్ బలోపేతంతో సిబ్బంది సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమైంది.

## పల్లె ప్రగతికి 'రాజీ'లేని బాట.. బొమ్మరంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన..

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజీ రెడ్డి



**మసాయిపేట,ఏప్రిల్ 20(సూర్యరేఖ)** పల్లెలే దేశానికి వెన్నెముక అని,ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజీ రెడ్డి అన్నారు.సోమవారం మసాయిపేట మండలం బొమ్మరం గ్రామంలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామస్తుల ఏళ్ల నాటి కల అయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ఘనంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆవుల రాజీ రెడ్డి మాట్లాడుతూ... వర్షాకాలం వస్తే బొమ్మరం వీధులు బురదమయంగా మారి, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు,వృద్ధులు పడుతున్న ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. ఆ ఇబ్బందులను శాశ్వతంగా తొలగించాలనే సంకల్పంతోనే ఈ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించామని పేర్కొన్నారు.

**అధికారులకు కఠిన ఆదేశాలు..**

రోడ్డు నిర్మాణంలో ఎక్కడా అలసత్వం వహించవద్దని ఆయన అధికారులను మరియు కాంట్రాక్టర్లను హెచ్చరించారు.నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని స్పష్టం చేశారు.నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి,ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని ఆదేశించారు.పనులు జరుగుతున్న తీరును స్థానిక నేతలు,ప్రజలు కూడా పర్యవేక్షించాలని సూచించారు.

**నీరాజనం పట్టిన బొమ్మరం..**


తమ చిరకాల వాంఛను నెరవేర్చిన రాజీరెడ్డికి గ్రామస్తులు నీరాజనం పట్టారు.డప్పు వాయిద్యాలు, బాణాసంచా నడుమ నేతలకు ఘన స్వాగతం పలికారు.అభివృద్ధికి అండగా నిలుస్తున్న నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్,కాంగ్రెస్ మండల్ అధ్యక్షుడు శ్రీకాంత్ నాగి రెడ్డి,మసాయిపేట సర్పంచ్ క్రిష్ణరెడ్డిలతో పాటు వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




# దెయ్యాలు వర్సెస్ పిచ్చివాళ్లు.. ఇంట్రెస్టింగ్‌గా సేవ్ ది టైగర్స్ డైరెక్టర్ ‘ఓం శాంతి డిస్కో శాంతి’ మోషన్ పోస్టర్

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని డైరెక్టర్ మహి వి రాఘవ్. యాత్ర, ఆనందో బ్రహ్మ లాంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ డైరెక్టర్ సేవ్ ది టైగర్స్ సిరీస్‌తో మూవీ లవర్స్ ను ఫుల్ ఎంటర్‌టైన్ చేశాడు. తాజాగా హార్రర్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మహి వి రాఘవ్ డైరెక్ట్ చేస్తున్న చిత్రం ఓం శాంతి డిస్కో శాంతి. క్యాప్షన్‌తో వస్తోంది. ఇప్పటివరకు దెయ్యాలు మనుషులను భయపెట్టాయి.. కానీ ఆ దెయ్యాలకే భయం పుట్టించే వాళ్లు ఎదురైతే..? అసలు భయం అంటే తెలియని పిచ్చివాళ్లు ఈ దెయ్యాల ముందుకొస్తే ఎలా ఉంటుంది. దెయ్యాలు వర్సెస్ పిచ్చివాళ్ల మధ్య జరిగే ఎలిమెంట్స్‌తో సాగే ఫన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతున్నట్టు మోషన్ పోస్టర్‌తో హింట్ ఇచ్చేశాడు. త్రీ ఆటమ్ లీవ్స్ షో రన్నర్ బ్యానర్‌పై శివ మేక, సాహితి చింతల పూడి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహి వి రాఘవ్ కథ, స్క్రీన్ ప్లే కూడా అందిస్తున్నాడు. కృష్ణకుమార్ సంగీతం సమకూరుస్తున్నాడు. రోహిణి, ముక్కు అవినాష్, షకలక శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని సెప్టెంబర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇంతకీ దెయ్యాలు పిచ్చివాళ్లను భయపెట్టగలవా..? లేక పిచ్చివాళ్లే తిరగబడి దెయ్యాల్ని భయపెడతారా..? అనే సన్నివేశాలతో ఊహించని ట్విస్టులతో సాగనున్న సాగనున్నట్టు మేకర్స్ హింట్ ఇస్తున్నారు.

# పెద్ది’ కష్టం.. 5 నిమిషాల సీన్‌కు 3నెలల సమయం



రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘పెద్ది’.. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. ఈ మూవీ కోసం పనిచేసిన ఫ్రేమ్ ఎక్స్ వీఎఫ్ఎక్స్ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఇంగ్లీష్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన మూవీ వీఎఫ్ఎక్స్ పనిగురించి మాట్లాడారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ మూవీని నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరకర్త. పెద్ది సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్‌కు సంబంధించి ఫ్రేమ్ ఎక్స్ అనే సంస్థ పనిచేస్తుంది. మూవీలోని కొన్ని సీన్స్ గురించి ఆ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. పెద్ది సినిమాలోని 5 నిమిషాల రెజ్లింగ్ సీన్ వీఎఫ్ఎక్స్ కోసం చాలా ఎక్కువ సమయం పడిందని ఆయన అన్నారు. ఈ సీన్ పూర్తి చేసేందుకు సుమారు 3నెలల సమయం పడినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. వీఎఫ్ఎక్స్ పని ఫ్రేమ్ వారీగా ఉంటుందని, ఒక నిమిషానికి 1440 ఫ్రేమ్‌లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల, ప్రతి ఫ్రేమ్‌లో చేసిన మెరుగుదల పరిధిని బట్టి పని ఖర్చు మారుతుంది” అని ఆయన చెప్పారు. పెద్ది గురించి నిలేష్ ఇచ్చిన అప్‌డేట్ అభిమానులను ఖచ్చితంగా సంతోషపరుస్తుంది. ఎందుకంటే ఎలాంటి రాజీ లేకుండా ప్రేక్షకులకు సాధ్యమైనంత ఉత్తమమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో చిత్ర బృందం విఎఫ్ఎక్స్ కోసం తగినంత సమయాన్ని కేటాయిస్తోంది. పెద్ది మూవీలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలలో కనిపించనున్నారు.


# ‘పెద్ది’ కష్టం.. 5 నిమిషాల సీన్‌కు 3నెలల సమయం



రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘పెద్ది’.. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. ఈ మూవీ కోసం పనిచేసిన ఫ్రేమ్ ఎక్స్ వీఎఫ్ఎక్స్ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఇంగ్లీష్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన మూవీ వీఎఫ్ఎక్స్ పనిగురించి మాట్లాడారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ మూవీని నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరకర్త. పెద్ది సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్‌కు సంబంధించి ఫ్రేమ్ ఎక్స్ అనే సంస్థ పనిచేస్తుంది. మూవీలోని కొన్ని సీన్స్ గురించి ఆ సంస్థ అధినేత నిలేష్ పలు వ్యాఖ్యలు చేశారు. పెద్ది సినిమాలోని 5 నిమిషాల రెజ్లింగ్ సీన్ వీఎఫ్ఎక్స్ కోసం చాలా ఎక్కువ సమయం పడిందని ఆయన అన్నారు. ఈ సీన్ పూర్తి చేసేందుకు సుమారు 3నెలల సమయం పడినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. వీఎఫ్ఎక్స్ పని ఫ్రేమ్ వారీగా ఉంటుందని, ఒక నిమిషానికి 1440 ఫ్రేమ్‌లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల, ప్రతి ఫ్రేమ్‌లో చేసిన మెరుగుదల పరిధిని బట్టి పని ఖర్చు మారుతుంది” అని ఆయన చెప్పారు. పెద్ది గురించి నిలేష్ ఇచ్చిన అప్‌డేట్ అభిమానులను ఖచ్చితంగా సంతోషపరుస్తుంది. ఎందుకంటే ఎలాంటి రాజీ లేకుండా ప్రేక్షకులకు సాధ్యమైనంత ఉత్తమమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో చిత్ర బృందం విఎఫ్ఎక్స్ (ఎఫ్ఎ) కోసం తగినంత సమయాన్ని కేటాయిస్తోంది. పెద్ది మూవీలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలలో కనిపించనున్నారు.


# యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ‘వాలా 2’ ట్రైలర్




రెండున్నర వారాల క్రితం మలయాళంలో రిలీజై సెన్సేషన్ సృష్టిస్తున్న సినిమా ‘వాలా 2’. స్కూల్ పిల్లల నేపథ్య కథతో కేవలం రూ.10 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. కట్ చేస్తే ఏకంగా రూ.200 కోట్ల కలెక్షన్స్ సాధించి ప్రతి ఒక్కరూ అవాక్కయ్యేలా చేస్తోంది. ఇప్పుడీ చిత్రాన్ని తెలుగులోనూ ఈ శుక్రవారం(ఏప్రిల్ 24) రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే హీరో నాని చేతుల మీదుగా తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ బట్టి చూస్తే నలుగురు స్టూడెంట్స్ జీవితాల్లో స్కూల్ లైఫ్ ఎలాంటి పాత్ర పోషించింది? చివరకు వాళ్లు ఏం తెలుసుకున్నారు? అనే విషయాల్ని కామెడీ, ఎమోషనల్‌గా చూపించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ‘సంక్రాంతికి చిరంజీవితో ‘మన శంకర వరప్రసాద్’ తీసిన సాహు గారపాటి.. ‘వాలా 2’ నిర్మాతల్లో ఒకరు కావడం విశేషం. మలయాళంలో సంచలనాలు ?క్రియేట్ చేసిన ఈ చిత్రం.. తెలుగులో ఎలాంటి ఫలితం అందుకుంటుందో చూడాలి?

# మరోసారి తల్లి కాబోతున్న దీపిక.. ‘రాకా’ కోసం కీలక నిర్ణయం!



బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె రెండోసారి తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ఈ శుభవార్తని ఆదివారం అభిమానులతో పంచుకుంది దీపిక. దీంతో అందరూ రణ్‌వీర్, దీపిక దంపతులకు శుభాకాంక్షలు చెప్పారు. అదే సమయంలో ఆమె కొత్త సినిమాలపై రకరకాల పుకార్లను కూడా పుట్టించారు. దీపిక ఇక ఏ సినిమా షూటింగ్‌లో పాల్గొనదని.. పూర్తిగా రెస్ట్ తీసుకుంటుందనే వార్తలు వినిపించాయి. కానీ అందులో ఎలాంటి నిజం లేనట్లు తెలుస్తోంది. ఒప్పుకున్న సినిమాలను పూర్తి చేసిన తర్వాతే ఆమె విశ్రాంతి తీసుకోనున్నారట.

**రాకా కోసం యాక్షన్**

దీపికా ఒప్పుకున్న సినిమా రాకా ఒక్కటి. అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రమిది. సన్ పిక్చర్స్ ఏకంగా రూ.800 కోట్ల బడ్జెట్లో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇంకా సగం కూడా పూర్తికాలేదు. ఇందులో దీపికా పదుకొనే కీలక పాత్ర పోషిస్తుంది. ఆమె పాత్రకు యాక్షన్ సీన్స్ కూడా ఉన్నట్లు సమాచారం. గర్భం దాల్చినప్పటికీ.. యాక్షన్ సీన్స్ చేయడానికి దీపికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ ఈ షూటింగ్ పూర్తి చేయాలని దీపిక నిర్ణయం తీసుకుందట. ఈ విషయం దర్శకుడు అట్లీకి కూడా చెప్పడంతో.. వీలైనంత తొందరగా దీపికకు సంబంధించిన సన్నివేశాల షూటింగ్‌ని పూర్తి చేయాలని ఆయన భావిస్తున్నాడట.

**‘కింగ్’కోసం కూడా..**

దీపికా ఒప్పుకున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ ‘కింగ్’. షారుఖ్ ఖాన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ కూడా ఇంకా పూర్తికాలేదు. ఇందులో కూడా దీపిక పదుకొణె పాత్రకు యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయట. వాటిని కూడా ఆమె ప్రెగ్నెంట్ గా ఉంటూనే పూర్తి చేయాల్సి ఉంది. తనవల్ల షూటింగ్‌కి అంతరాయం కావొద్దనే దీపికా ఈ నిర్ణయం తీసుకుందట. ‘పఠాన్’లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత షారుక్‌ఖాన్ - సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఆసక్తికరంగా ‘చిరంజీవి’ మూవీ గ్లింప్స్



తెలుగులో ప్రయోగాత్మక సినిమాలు అప్పుడప్పుడు వస్తుంటాయి. ఇప్పుడు కూడా ‘చిరంజీవి’ పేరుతో ఓ సినిమా తీశారు. ఇందులో డెక్స్ట్రోకార్డియా అనే వ్యాధి.. హీరోకు ఉంటుంది. అంటే ఎడమ వైపు ఉండాల్సిన గుండె.. కుడివైపు ఉంటుందనమాట. దీని వల్ల అప్పుడప్పుడు శరీరంలోని ఆక్సిజన్ లెవల్స్ హెచ్చుతగ్గులు అవుతుంటాయి. అలా జరిగినప్పుడల్లా బాడీ నీలం రంగులోకి మారిపోతుంటుంది. ఈ మేరకు తాజాగా గ్లింప్స్ రిలీజ్ చేశారు. అయితే హీరోకి ఆక్సిజన్ సరిపోక స్పృహ తప్పి పడిపోయినప్పుడు హీరోయిన్ ఇచ్చి ముద్దుపెట్టి ఆక్సిజన్ అందించడం మాత్రం కాస్త సినిమాటిక్‌గా అనిపించింది. చివరలో మళ్లీ హీరోకి కుడివైపు కాదు ఎడమవైపే గుండె ఉంది అన్నట్లు చిన్న సస్పెన్స్ పెట్టడం ఆసక్తికరంగా అనిపించింది. గ్లింప్స్ అయితే బాగానే ఉంది గానీ పూర్తి మూవీ ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. హీరోహీరోయిన్, దర్శకుడు, నిర్మాత అందరూ కొత్తవాళ్లే కావడం విశేషం.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,